## కెనడాలో బెయిల్‌పై విడుదలైన ఖలిస్థానీ టెర్రరిస్ట్..

ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజీత్ సింగ్ గోసల్ కెనడా దేశంలో మూడు రోజుల క్రితం అరెస్టైన విషయం తెలిసిందే. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉండటం సహా పలు అభియోగాలపై గోసల్‌ను ఒట్టావాలో అదుపులోకి తీసుకున్నారు. అయితే, అరెస్టైన నాలుగు రోజుల్లోనే అతడు విడుదలయ్యాడు. బెయిల్‌పై ఒంటారియో సెంట్రల్ ఈస్ట్ కరెక్షనల్ సెంటర్ నుంచి బయటకు వచ్చాడు. జైలు నుంచి బయటకు వచ్చిన గోసల్.. తాను ఇప్పుడు స్వేచ్ఛగా ఉన్నానని వ్యాఖ్యానించాడు. ఖలిస్థాన్ కోసం పన్నూన్ చేస్తున్న ఉద్యమానికి మద్దతు ఇస్తానని ప్రకటించాడు. 'ఢిల్లీ బనేగా ఖలిస్తాన్' అంటూ మీడియాతో అన్నాడు.గోసల్ విడుదలైన అనంతరం సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకడైన గుర్‌పత్వంత్ సింగ్ పన్నూన్ .. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడ్డాడు. 'అజిత్ దోవల్.. మీరు కెనడా, అమెరికా లేదా ఏదైనా యూరోపియన్ దేశానికి ఎందుకు రావట్లేదు. వచ్చి నన్ను అరెస్ట్ చేయడానికి, లేదా అదుపులోకి తీసుకోడానికి ఎందుకు ప్రయత్నించకూడదు. మీ రాకోసం ఎదురుచూస్తున్నాను' అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :185 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 27-09-2025 | పేజీలు:4 వెల: 2.00


## జూబ్లీహిల్స్ బైపోల్.. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత..



హైదరాబాద్, తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేడెక్కింది. ఈ నియోజకవర్గానికి జరగనున్న బైపోల్‌కు సంబంధించి పార్టీ అభ్యర్థిని ఖరారు చేసింది బీఆర్ఎస్ . దివంగత మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత పేరును కేసీఆర్ ప్రకటన చేశారు. ఆమె పేరు ప్రకటించడం వెనుక కారణాలు చాలానే ఉన్నాయి.వచ్చేవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ రానున్న వార్తల నేపథ్యంలో రాజకీయ పార్టీలు అలర్ట్ అయ్యాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ ముమ్మురంగా కసరత్తు చేశాయి. ఈ రెండు పార్టీల అభ్యర్థులు ఎవరన్నది తేలిన తర్వాత బీజేపీ అభ్యర్థి ఎవరన్నది తేలనుంది.ఎమ్మెల్యే లేదా ఎంపీ ఉపఎన్నిక ఎప్పుడు వచ్చినా అధికార పార్టీ నుంచి చాలామంది రేసులో ఉంటారు. ఎందుకంటే ఆ పార్టీ నుంచి టికెట్ వస్తే గెలవడం ఈజీ అవుతుందని నాయకులు భావిస్తుంటారు. జూబ్లీహిల్స్ బైపోల్ రేసులో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి చాలామంది నేతలు పోటీపడుతున్నారు. పలుమార్లు నియోజకవర్గంలో ఆ పార్టీ సర్వే చేయించింది. పార్టీ హైకమాండ్‌కు నివేదిక వెళ్లిపోయింది. నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థిని ప్రకటించే అవకాశమున్నట్లు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.ఇక బీఆర్ఎస్ విషయానికి వద్దాం. ఆ నియోజకవర్గానికి సంబంధించి ప్రతీ డివిజన్‌కు చెందిన నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వాహించారు కేటీఆర్. వారి నుంచి సమాచారం తీసుకున్న ఆయన, ఆ తర్వాత పార్టీ హైకమాండ్‌కు వివరించారు. ఈ క్రమంలో దివంగత మాగంటి గోపీనాథ్ భార్య సునీత పేరును ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటన చేశారు.ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కొత్తవారికి టికెట్ ఇస్తే వర్కవుట్ కాదని బీఆర్ఎస్ అంచనా. అందులో మూడుసార్లు మాగుంట గోపీనాథ్ ఎమ్మెల్యేగా గెలవడంతో ఆయన కుటుంబసభ్యులకు టికెట్ ఇస్తే ఫలితం దక్కుతుందని భావించి సునీత పేరును ఖరారు చేసింది.నియోజకవర్గం ప్రజల ఆకాంక్షలు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంది బీఆర్ఎస్. ఆ తర్వాత కేసీఆర్ తన నిర్ణయాన్ని వెల్లడించారు. దీనిద్వారా మాగంటి గోపీనాథ్ కుటుంబానికి పార్టీ అండగా నిలిచిందనే బలమైన సంకేతాలను పంపించింది.మరోవైపు బీజేపీ ఈ నియోజకవర్గంపై దృష్టి పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. ఇప్పుడు అలాంటి వ్యూహాన్ని అవలంభించాలని ఆలోచన చేస్తోంది. ఆ పార్టీ అభ్యర్థి రేసులో ఇద్దరు లేదా ముగ్గురు నేతలు ఉన్నట్లు సమాచారం.అధికార పార్టీ తన అభ్యర్థిని ప్రకటించిన తర్వాత బీజేపీ ప్రకటిస్తుందా? ఉప ఎన్నికకు దూరంగా ఉండాలని భావిస్తుందా? అనేది తెలియాల్సివుంది. ఒకవేళ బీజేపీ గనుక డ్రాపయితే ఆ పార్టీ ఓట్లు బీఆర్ఎస్ పడడం ఖాయమని, కారు పార్టీ గెలవడం ఈజీ అవుతుందని కొందరు నేతలు ఆఫ్ ద రికార్డులో చర్చించుకుంటున్నారు. మరి తెలంగాణ బీజేపీ నేతల మదిలో ఏముందో చూడాలి.

## అమెరికాకు ఫార్మా ఎగుమతుల్లో భారత్ నంబర్ 1 కాదు.. మనకేం నష్టం లేదు



న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో టారిఫ్ బాంబు పేల్చాడు. అమెరికాకు ఎగుమతి అయ్యే ఔషధాలపై అక్టోబర్ 1 నుంచి వంద శాతం టారిఫ్ విధిస్తామని ప్రకటించారు.అయితే అమెరికాలో ప్లాంట్లు నిర్మించే వారికి మినహాయింపు ఇచ్చారు. ఈ నేపథ్యంలో భారత్ ఫార్మారంగంతోపాటు ప్రపంచదేశాల్లో కలవరం మొదలైంది. ఎందుకంటే 2024లో అమెరికాకు ఎగుమతయ్యే ఔషధ ఉత్పత్తుల మొత్తం 234 బిలియన్ డాలర్లకు చేరింది, ఇందులో ఐర్లాండ్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ దేశం 65.7 బిలియన్ల విలువైన ఎగుమతులతో మొత్తంలో 28.1% వాటాను కలిగి ఉంది. ప్రధాన కారణం ఐర్లాండ్‌లోని అమెరికన్ ఔషధ కంపెనీలు (పఫైజర్, జాన్సన్ – జాన్సన్ వంటివి) పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నాయి, ట్యాక్స్ ప్రయోజనాలు, పరిశోధన కేంద్రాలు ఎగుమతులను పెంచాయి. ఇది యూఎస్ ఆరోగ్య వ్యవస్థకు కీలకమైనది.

స్విట్జర్లాండ్, జర్మనీలు రెండు, మూడో స్థానాల్లో..

స్విట్జర్లాండ్ (19.3 బిలియన్ డాలర్లతో 8.2%) రెండో స్థానంలో ఉండగా, జర్మనీ (17.4 బిలియన్ డాలర్లతో 7.4%) మూడో స్థానం సాధించింది. ఈ దేశాలు అధిక-ప్రమాణాల ఔషధాలు (బయోలాజిక్స్, మోనోక్లోనల్ యాంటీబాడీలు) ఎగుమతి చేస్తున్నాయి. స్విట్జర్లాండ్‌లోని నోవార్టిస్, రోష్ వంటి కంపెనీలు యూఎస్ మార్కెట్‌కు ప్రధాన సరఫరాదారులు. జర్మనీ ఉత్పత్తి సామర్థ్యం, ఆర్అండ్‌డీ పెట్టుబడులతో ప్రపంచవ్యాప్తంగా మొదటి స్థానాల్లో ఉంటుంది. ఐరోపా మొత్తం యూఎస్ ఎగుమతుల్లో 50% పైగా వాటా కలిగి ఉంది.

భారత్ ఐదో స్థానం..

ఆసియా నుంచి సింగపూర్ (16.7 బిలియన్ డాలర్ల ఔషధాలు) నాల్గో స్థానంలో ఉండగా, భారత్ (13.6 బిలియన్ డాలర్ల ఔషధాలు) ఐదో స్థానంలో ఉంది. భారత్ యూఎస్ ఎగుమతులలో 6% వాటాతో 'ఔషధ ఫార్మసీ ఆఫ్ ది వరల్డ్'గా పిలువబడుతోంది, జెనరిక్ మందులు, వ్యాక్సిన్లు (సీరమ్ ఇన్‌స్టిట్యూట్ వంటివి) ప్రధానం. చైనా (9.5 బిలియన్ డాలర్ల ఔషధాలు) ఎనిమిదో స్థానంలో ఉండి, ఏపీఐలు (ఆక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియెంట్స్) ఎగుమతిలో బలం చూపిస్తోంది. ఆసియా దేశాలు తక్కువ ధరలు, పెద్ద ఉత్పత్తి సామర్థ్యంతో యూఎస్ మార్కెట్‌లో పోటీ పెంచుతున్నాయి.

ఇతర దేశాలు..

బెల్జియం, ఇటలీ (12 బిలియన్ డాలర్ల చొప్పున) ఆరు, ఏడో స్థానాల్లో ఉన్నాయి. యూకే(7.6 బిలియన్ డాలర్లు), జపాన్ (7.4 బిలియన్ డాలర్లు) తొమ్మిదో, పదో స్థానాలు. ఈ దేశాలు ప్రత్యేక ఔషధాలు (అంకాలజీ, న్యూరాలజీ) ఎగుమతిలో ప్రత్యేకత చూపుతున్నాయి. మొత్తం టాప్-10 దేశాలు యూఎస్ ఆదాసాలలో 80% పైగా కవర్ చేస్తున్నాయి,2024 గణాంకాలు యూఎస్ ఫార్మా ఎగుమతులు పెరిగినప్పటికీ (మునుపటి ఏడాది నుంచి 10-15% వృద్ధి), ఇది ఆరోగ్య ధరలు, సరఫరా గొలుసు ఆధారాలపై ప్రభావం చూపుతుంది. ఐర్లాండ్, స్విట్జర్లాండ్ వంటి దేశాల ఆధిపత్యం అమెరికన్ కంపెనీల ప్రవాస ఉత్పత్తికి ఆధారం, కానీ భారత్, చైనా వంటి దేశాలు తక్కువ ధరలతో పోటీ పెంచుతున్నాయి. ట్రంప్ పాలనలో టారిఫ్‌లు, 'మేడ్ ఇన్ అమెరికా' విధానాలు ఈ ఆధారాన్ని మార్చవచ్చు, కానీ ఇప్పటికి యూఎస్ 80% మందులు ఆదా చేస్తోంది.

## ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్యపై సొంత పార్టీ ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు

యాదాద్రి:యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీలో ముసలం రేగింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై సొంత పార్టీ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సంచలన ఆరోపణలు చేశారు. లఫంగి రాజకీయాలు చేయకు..రాజకీయ వ్యభిచారం మానుకో..మీ బంధుత్వం కోసం కాంగ్రెస్ పార్టీ ని బొందపెట్టకు అంటూ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మదర్ డెయిరీ ఎన్నికల్లో మా జిల్లా నాయకులు కొంతమంది నా నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టకుంటున్నారంటూ సామేల్ ఆరోపించారు. ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు, మదర్ డెయిరీ చైర్మన్ లు వారి బంధుత్వం కోసం, స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ పార్టీని బొందపెట్టవద్దని హితవు పలికారు. మదర్ డెయిరీ ఎన్నికల్లో డైరెక్టర్ గా లక్ష్మినర్సింహారెడ్డికి ఓటు వేయకండని కోరారు.

సీఎం, పీసీసీ చీఫ్ లకు ఫిర్యాదు చేస్తా

మదర్ డెయిరీఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే..నైతిక బాధ్యత వహిస్తూ బీర్ల ఐలయ్య రాజీనామా చేయాలని సామేల్ డిమాండ్ చేశారు. బీర్ల ఐలయ్య కాంగ్రెస్ పార్టీని నాశనం చేసే కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. ప్రలోభాలకు పోకుండా ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని..కాంగ్రెస్ అభ్యర్థులు ఓడితే పార్టీ నాయకులు, కార్యకర్తలు మీకు సరైన బుద్ధి చెపుతారని హెచ్చరించారు.




బీర్ల ఐలయ్య కాంగ్రెస్ పార్టీ కి రాజీనామా చేసి..రాజకీయ వ్యభిచారం చేస్తే మంచిదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మదర్ డెయిరీ ఎన్నికలలో బీఆర్ఎస్ తో పొత్తుపెట్టుకున్న అంశంపై నేను వెంటనే సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు, ఇంచార్జి మీనాక్షి నటరాజన్ కు ఫిర్యాదు చేస్తున్నట్లుగా తెలిపారు. మదర్ డెయిరీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడితే ఐలయ్యపైన, డీసీసీ అధ్యక్షుడు, మదర్ డెయిరీ చైర్మన్లపైన చర్యలు తీసుకోవాలని వారిని కోరుతున్నానన్నారు.

## రాహుల్ ప్రియాంక అనుబంధంపై బీజేపీ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ , ఆయన సోదరి ప్రియాంక గాంధీ మధ్య ఉన్న సోదర బంధంపై బీజేపీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మంత్రి కైలాశ్ విజయవర్గీయ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో రాహుల్ తన సోదరి పట్ల చూపే ఆప్యాయత భారతీయ సంస్కృతికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. అది విదేశాల నుంచి తెచ్చుకున్న విలువలని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్‌లో గురువారం పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కైలాశ్ విజయవర్గీయ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'మేము పాత సంస్కృతికి చెందినవాళ్లం. మా సోదరీమణుల గ్రామంలో కనీసం నీళ్లు కూడా తాగము. మా అత్త నివసించే జిరాపూర్‌కు వెళ్లినప్పుడు నా తండ్రి కుండ నీరు తీసుకెళ్లేవారు. కానీ, నేడు మన ప్రతిపక్ష నాయకులు తమ సోదరీమణులను నడిరోడ్డుపైనే ముద్దుపెట్టుకుంటున్నారు.మిమ్మల్ని నేను ఒకటి అడగాలనుకుంటున్నాను.. మీలో ఎవరైనా బహిరంగంగా మీ సోదరిని లేదా కూతురిని ముద్దుపెట్టుకుంటారా..? ఇది విలువలు లేకపోవడమే. ఇవన్నీ విదేశాల్లో పెరగడం వల్ల వచ్చిన విదేశీ విలువలు. వాళ్లు మన ప్రధాన మంత్రితో కూడా అమర్యాదగానే మాట్లాడతారు' అని అన్నారు. కైలాశ్ విజయవర్గీయ వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారి తీశాయి. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.తన వ్యాఖ్యలపై చెలరేగిన వివాదంపై స్పందించిన కైలాశ్ విజయవర్గీయ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అది రాహుల్ గాంధీ తప్పు కాదని వ్యాఖ్యానించారు. ఆయన విదేశాల్లో చదువుకొని అక్కడి విలువలను ఇక్కడికి తీసుకొచ్చారంటూ విమర్శించారు. 'అది ప్రతిపక్ష నేత తప్పు కాదు. విదేశాల్లో చదువుకొని అక్కడి విలువలను ఇక్కడికి తీసుకొచ్చారు. రాహుల్‌కు భారతీయ సంప్రదాయాల గురించి అవగాహన లేదు. ఆయన ప్రధాన మంత్రిని కూడా అమర్యాదగా 'నువ్వు' అని సంబోధిస్తారు' అంటూ విజయవర్గీయ వ్యాఖ్యానించారు.

## పార్టీకి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుడ్ బై?



హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు చాలా హాట్ హాట్ గా కొనసాగుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి అడుగడుగున కౌంటర్ ఇస్తూ గులాబీ పార్టీ దూసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే.హరీష్ రావు అలాగే కల్వకుంట్ల తారక రామారావు ఇద్దరు కూడా రేవంత్ రెడ్డికి నిద్రలేకుండా చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ లో ఉన్న నేతలు అసంతృప్తికి లోనవుతున్నారు. కొంతమంది ఆ పార్టీలో ఉండడం కంటే బయటకు రావడమే మేలు అంటూ.. బహిరంగంగానే చెబుతున్నారు.మంత్రులు కూడా వచ్చే ఎన్నికల్లో గెలుస్తామో లేదో అని చెప్పేస్తున్నారు. అయితే ఇలాంటి నేపథ్యంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన కోనేరు కొన్నప్ప.. మళ్లీ గులాబీ కండువా కప్పుకున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన ఆయన వెంటనే కాంగ్రెస్ గూటికివెళ్లడం జరిగింది. అయితే అక్కడే సిర్పూర్ దగ్గర పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కెసిఆర్ చెంతకు చేరారు. సిర్పూర్ లో తనకు పలుకుబడి పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ఇలాంటి నేపథ్యంలో కోనేరు కొన్నప్ప మళ్లీ యూటర్న్ తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తూ గులాబీ గూటికి చేరుకున్నారు. హరీష్ రావు అలాగే కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో. గులాబీ పార్టీలో చేరారు కోనేరు కొన్నప్ప. దింతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అలిగినట్లు తెలుస్తోంది. ఆయన పార్టీకి దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. తనకు కచ్చితంగా సిర్పూర్ టికెట్ వస్తుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్అన్ని ఇంటర్వ్యూలలో చెబుతున్నారు. ఇప్పుడు కోనేరు కొన్నప్ప రావడంతో ఆయనకు షాక్ తగిలింది.మరి దీనిపై కేసీఆర్ ఎలా ముందుకు వెళ్తారో చూడాలి.

## మిగ్21 విశ్వాసాన్ని పెంచింది.. ఇండోరష్యా బంధానికి చిహ్నం

చండీఘడ్: మిగ్21 విమానాల రిటైర్మెంట్‌సందర్భంగా ఇవాళ చండీఘడ్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. మిగ్21 కేవలం విమానం మాత్రమే కాదు అని, అది భారత్, రష్యా సంబంధాలకు సాక్ష్యం అన్నారు.

1971 యుద్ధాన్ని ఎవరూ మరిచిపోలేరని, పాకిస్థాన్‌తో జరిగిన ఆ వార్ సమయంలో.. ఢాకాలో ఉన్న గవర్నర్స్ హౌజ్‌పై మిగ్21 అటాక్ చేసిందన్నారు. ఇక ఆ రోజే యుద్ధం స్వరూపం మారిపోయిం దన్నారు.ఎప్పుడు చరిత్రాత్మక మిషన్స్ చేపట్టినా, అప్పుడు మిగ్21 త్రివర్ణ పతకాన్ని ఎగరవేసిందన్నారు. జాతి గర్వించదగ్గ ఆ సందర్భాలను ఫేర్‌వెల్‌లో గుర్తు చేసుకోవాలన్నారు. 1963 నుంచి భారతీయుల స్మృతుల్లో, మనోభావాల్లో మిగ్21 చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఇది మనకు కేవలం ఫైటర్ జెట్ మాత్రమే కాదు, ఓ కుటుంబసభ్యుడి తరహాలో ఉండిపోయిందన్నారు. ఆ యుద్ధ విమానంతో డీప్ అటాచ్‌మెంట్ పెరిగిందన్నారు. మన విశ్వాసాన్ని పెంచి, మన వ్యూహాలను బలోపేతం చేసిందన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న ఆ జెట్.. ప్రతి సారి తన సామర్థ్యాన్ని ప్రదర్శించిందన్నారు.40 ఏళ్లుగా ఇండియాలో మిగ్ విమానాలు




ఎగురుతున్నా.. ఆ విమానాలు మాత్రం ఎప్పటికప్పుడు టెక్నికల్‌గా అప్‌డేట్ అయినట్లు చెప్పారు. మిగ్21 విమానాలను రకరకాల పేర్లతో పిలిచారని, త్రిశూల్, విక్రమ్, బాదల్, బైసన్ పేర్లతో పిలిచినట్లు చెప్పారు. మిగ్21ను ఎప్పటికప్పుడు రేడార్స్, ఏవియానిక్స్‌తో అప్‌డేట్ చేసిన హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంస్థను ప్రశంసిస్తున్నట్లు రాజ్‌నాథ్ చెప్పారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం.. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల, సెప్టెంబర్ 26: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో మున్సిపల్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసిన ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చాకలి ఐలమ్మ మహిళ కాదని తెలంగాణ ఉద్యమ చరిత్రలో అజరామరమైన శక్తి అని పేర్కొన్నారు.నల్గొండ జిల్లా సాయుధ పోరాటాల్లో ఆమె చూపిన తెగువ, ధైర్యం, అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం భావితరాలకు మార్గ దర్శకం అన్నారు. తెలంగాణ మహిళల ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని, సమాజంలో న్యాయం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలనీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్, వివిధ పార్టీల నాయకులు జువ్వాడి కృష్ణారావు, దారిశెట్టి రాజేష్, చెన్న విశ్వనాథం



సుతారి రాములు, చింత భూమేశ్వర్, పేర్ల సత్యం, మహమ్మద్ అతిక్, పోట్ట సురేందర్, సందయ్య,చిత్తరీ ఆనంద్, ఎక్కల్ దేవి నవీన్ కుమార్, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మళ్లీ భారీ వర్షాలు.. పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ



విశాఖపట్నం,సెప్టెంబర్ 26: వాయువ్య, మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం శుక్రవారం వెల్లడించింది. ఇది పశ్చిమ దిశగా కదులుతూ బలపడి మరి కొద్ది గంటలలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. అనంతరం పశ్చిమ దిశగా ఇది కదులుతూ శనివారానికి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉందని స్పష్టం చేసింది. దీని ప్రభావంతో రాగల ఐదు రోజులపాటు ఏపీలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. అయితే రానున్న 24 గంటలలో కోస్తా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని చెప్పింది.ఇక ఈ రోజు.. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, ఏలూరు, ఎన్ టి ఆర్, ప్రకాశం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.అలాగే కాకినాడ, పశ్చిమగోదావరి, కోనసీమ,కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప జిల్లాలకు ఎల్లో అలర్ట్.శనివారం శ్రీకాకుళం, పార్వతీపురం, అల్లూరి, ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్ టి ఆర్, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు తెలిపింది.

## సంపాదకీయం

శనివారం 27-09-2025

# తలొగ్గితే మన రైతులకు ముప్పే

ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) తన వ్యవసాయ నివేదికలో అల్పాదాయ రైతుల గురించి ప్రత్యేకంగా పేర్కొంది. ఇండియాలో 99.49శాతం అన్నదాతలు ఈ కోవలోకే వస్తారని చెప్పింది. అమెరికాలో భారీగా రాయితీలు ఇస్తుండటం వల్ల అక్కడి రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ధరకు ఎగుమతి చేయగలుగుతారు. దీంతో మన సన్న, చిన్నకారు రైతులు ఎలా పోటీ పడగలరని ఆర్థికవేత్త, డబ్ల్యూటీవో చర్చల్లో భారత్ తరఫున కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ బిశ్వజిత్ ధర్ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలనే పంతంతోనే ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో (బీటీఏ) ఇండియాపై ట్రంప్ ఒత్తిళ్లు తెస్తున్నారని 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి ఎం.ఎల్.నరసింహారెడ్డికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. ఆ వివరాలు...జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్‌గా బిశ్వజిత్ ధర్ పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం దిల్లీలోని కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్‌లో గౌరవ ఆచార్యులుగా పనిచేస్తున్నారు. రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్(ఆర్ఐఎస్) డైరెక్టర్ జనరల్‌గానూ కూడా విధులు నిర్వర్తించారు. డబ్ల్యూటీవోలో జరిగిన చర్చల్లో భారత బృందానికి ఆయన నేతృత్వం వహించారు.

అమెరికాతో వాణిజ్య ఒప్పంద చర్చల్లో భారత్‌కు ఎదురవుతున్న ప్రధాన సమస్య ఏంటి?

అమెరికా తన రైతులకు భారీగా రాయితీలు ఇస్తుంటుంది. దాంతో వారు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెటింగ్ ధరల కంటే తక్కువకు అమ్మగలుగుతారు. కొన్ని సందర్భాల్లో పండించడానికి అయిన వ్యయంకంటే కూడా తక్కువకే ఎగుమతి చేస్తారు. దీన్ని 'డంపింగ్'గా ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొంది. ఈ అంశాన్ని మనం లేవనెత్తాం. డబ్ల్యూటీవోలో జరిగిన చర్చల్లో నేను భాగస్వామినయ్యాను. తమ ఉ త్పత్తులపై సుంకాలు తగ్గించాలని అమెరికా కోరింది. అగ్రరాజ్య సబ్సిడీలు దిగిరాకుండా ఇండియా సుంకాలు తగ్గించడం సాధ్యంకాదని మనం చెప్పాం. అమెరికా కోరినట్లుగా చేస్తే దేశీయంగా గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్ తదితరాలను సాగుచేసే వారిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ధాన్యంపై సుంకాల గురించి ట్రంప్ ఫిర్యాదు చేస్తున్నారు. అమెరికా వరి ధాన్యాన్ని ఉత్పత్తి చేస్తుంది కానీ వినియోగించదు. ప్రపంచంలో ధాన్యాన్ని ఎక్కువగా ఎగుమతి చేసే దేశాల్లో అమెరికా ఒకటి. వాస్తవానికి ఇప్పటికే ఆల్మండ్స్, నట్స్ వంటివాటి మార్కెట్‌కు అనుమతించాం. అయితే, ఇండియా లాంటి భారీ విపణి ఎలాంటి సుంకాల అడ్డంకులు లేకుండా తమకు అందుబాటులోకి రావాలని అమెరికా పట్టుబడుతోంది. తద్వారా తన వ్యవసాయోత్పత్తులను విరివిగా ఎగుమతి చేయడం ద్వారా వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అగ్రరాజ్యం ప్రయత్నిస్తోంది. వాణిజ్య ఒప్పందం సాకారం కావడంలో ఇదే పెద్ద అవరోధంగా నిలుస్తోంది. ఇప్పటిదాకా భారత్ జరిపిన చర్చల్లో ఎక్కడా వ్యవసాయోత్పత్తుల అజెండానే లేదు. ఐరోపా సంఘం, యూకేతో వాణిజ్య చర్చల్లోనూ సాగు రంగ ఉత్పత్తులను చేర్చలేదు.

చైనాకు ఇలాంటి సమస్య లేదా?

ఇండియాలాగా అధిక జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న దేశం మరొకటి లేదు. చైనా తన సొంత అభివృద్ధి పంథాతో వ్యవసాయం నుంచి ఎక్కువ మందిని ఇతర రంగాల వైపు మళ్లించింది. చైనాలో పెద్దయెత్తున పట్టణీకరణ జరిగింది. మన దగ్గర వ్యవసాయంపై ఆధారపడేవారిని తగ్గించాలనుకుంటున్నా వీలు కావట్లేదు. అందుకే, వాణిజ్య ఒప్పందంలో అమెరికా డిమాండ్లు భారతదేశానికి సమస్యగా మారాయి.

డబ్ల్యూటీవో నిర్ణయం తరవాతా అమెరికా తన రైతులకు భారీ సబ్సిడీలను తగ్గించలేదా?

డబ్ల్యూటీవో లెక్కల ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక వ్యవసాయ సబ్సిడీలు అమెరికా రైతులకు లభిస్తున్నాయి. డబ్ల్యూటీవోలో సభ్యదేశంగా చేరినప్పటి నుంచి అమెరికా వ్యవసాయ రాయితీలను నాలుగు రెట్లు పెంచింది. అవి 1995లో 6,100 కోట్ల డాలర్లు ఉంటే, 2022 నాటికి 21,600 కోట్ల డాలర్లకు పెరిగాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ చర్చల్లో సుంకాలు, సబ్సిడీలు రెండింటి తగ్గింపుపై సమాంతరంగా చర్చలు జరిగాయి. సుంకాల తగ్గింపు అన్నది అమెరికా తన వ్యవసాయ సబ్సిడీలను కుదించడంపై ఆధారపడి ఉంటుందని భారతదేశం నిరంతరం వాదిస్తోంది. అయితే, ట్రంప్ ఏకపక్షంగా వ్యవహరిస్తుండటం వల్ల సుంకాలు సబ్సిడీల గురించి చర్చించడానికి అవకాశం ఉండట్లేదు. పైగా, వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యం విషయంలో తన భాగస్వాములే తప్పు చేస్తున్నట్లుగా ట్రంప్ చిత్రీకరిస్తున్నారు. విదేశాల నుంచి పప్పుదినుసులు ఇష్టారాజ్యంగా డంప్ కాకుండా భారత్ విధిస్తున్న సుంకాలు నివారిస్తున్నాయి. మన ఆహార భద్రతకూ అది రక్షణగా నిలుస్తోంది. ఆహార అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడితే ఏం జరుగుతుందన్న విషయంలో అమెరికాయే భారత్‌కు గుణపాఠం నేర్పింది. 1965లో భారత్–పాకిస్థాన్ మధ్య వివాదం తలెత్తినప్పుడు ఇండియా రాజకీయాలను ప్రభావితం చేసేందుకు పీఎల్–480 కింద మనకు అమెరికా గోధుమ ఎగుమతి చేసింది. ఆ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించాలని నిర్ణయించుకుని తగిన విధాన రూపకల్పన చేసింది. వాణిజ్య చర్చలు ఇంకా ఒక కొలిక్కి రాలేదన్న అక్కసుతో భారతదేశ ఎగుమతులపై ట్రంప్ అదనపు సుంకాలు విధించడం ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద స్ఫూర్తికి పూర్తి విరుద్ధం. దీర్ఘకాలిక సంబంధాల దృష్ట్యా ఇలాంటి ఒప్పందాలు ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉండాలి. దానికి భిన్నంగా ట్రంప్ దుందుడుకు వైఖరి భాగస్వామ్య దేశాల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉంటోంది. అది దురదృష్టకరం!

ట్రంప్ ఇంతగా మొండిపట్టు పట్టడానికి కారణమేంటి?

అమెరికా ఇటీవలి ఎన్నికలను పరిశీలిస్తే వ్యవసాయ రంగానికి చెందినవారు 77శాతం మంది ట్రంప్‌నకు ఓటేశారు. ఇండియాతో సహా అనేక దేశాలతో వాణిజ్య ఒప్పందాలు సాకారం చేస్తానని ఎన్నికల్లో ఆయన హామీ ఇచ్చారు. దాని అమలుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రాజకీయంగా ట్రంప్ మనుగడకు వాణిజ్య ఒప్పందాలు అత్యంత కీలకం. అందుకే, డబ్ల్యూటీవో అంశాల గురించి చర్చించడానికీ ఆయన ఇష్టప డటం లేదు. తమను ప్రత్యేకంగా చూడాలని, అన్ని దేశాలు సుంకాలు లేకుండా అమెరికా ఉత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ట్రంప్ పట్టుబడు తున్నారు. ఆయన చెప్పిన దానికి ఒప్పుకోకపోతే తమపట్ల అన్యాయంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అమెరికా వ్యవసాయ వ్యాపారాన్ని భారత్‌లోకి అనుమతిస్తే మన రైతులు జీవనోపాధిని కోల్పోతారు. ట్రంప్‌నకు బలమైన మద్దతు పలుకుతున్న అమెరికా అగ్రిబిజినెస్ లాబీ ప్రభావం వాణిజ్య చర్చల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

# జీతాలు,పెన్షన్లు, వడ్డీలే ముందు! ఆదాయం వచ్చినా రాకున్నా వీటికి సమకూర్చాల్సిందే!



హైదరాబాద్, జీతాలు, పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వడ్డీలు! దేనికి ఖర్చు చేయకపోయినా.. వీటికి మాత్రం ప్రతినెలా తప్పకుండా నిధులు సమకూర్చుకోవా ల్సిందే. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం వచ్చినా, రాకపోయినా వీటికి మాత్రం తప్పనిసరి. ఏమాత్రం తేడా వచ్చినా గందరగోళం ఏర్పడి, ప్రభుత్వం పరువు బజారున పడుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నా యని కాగ్ విడుదల చేసిన తాజా నివేదికనుబట్టి తెలుస్తున్నది. ఏపీలో 2013–14 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు రూ.22,980 కోట్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ల కోసం రూ.13,682 కోట్లు, తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లింపులు రూ.12,911 కోట్లు అవసరమయ్యాయి. ప్రతి ఏడాది రూ.49,573 కోట్లు నికరంగా చెల్లించాల్సిన డబ్బులు ఇవి. పదేళ్ళ తరువాత 2022%–%23 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల జీతాలకు రూ.36,583 కోట్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ల చెల్లింపులకు రూ.22,584 కోట్లు, అప్పులకు వడ్డీల కింద రూ.25,492 కోట్లు చెల్లింపులు చేశారు. మొత్తం రూ.84,659 కోట్లు అన్న మాట. ఏపీలో పన్నుల రాబడులు, సీఎస్ఎస్ నిధులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ మొత్తం రూ.1,57,768 కోట్లు కాగా.. ఇందులో నుంచి జీతాలు, పెన్షన్లు, వడ్డీలకు రూ.84,659 కోట్లు అంటే సగానికి పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

తెలంగాణలోనూ సేమ్ సీన్

తెలంగాణలో 2014–15 ఆర్థిక సంవత్సరంలో జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్లు, తీసుకున్న అప్పులకు వడ్డీలకు మొత్తం చెల్లించినది రూ.20,076 కోట్లు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు రూ.10,639 కోట్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు, పెన్షన్లకు రూ.4,210 కోట్లు, వడ్డీలకు రూ.5,227 కోట్లు చెల్లింపులు చేశారు. పోలీసు ఉద్యోగ నియామకాలు మినహా ఇతర నియామకాలు లేకున్నా, పీఆర్సీ పెంపు కారణంగా తొమ్మిది సంవత్సరాల తరువాత 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.15వేల కోట్లు అదనంగా భారం పెరిగింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్లు, వడ్డీలకు రూ.63 ,406 కోట్లు చెల్లించారు. ఇందులో ఉద్యోగుల జీతాలు రూ.25,769 కోట్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్లు రూ.15,816 కోట్లు, వడ్డీలకు రూ.21,821 కోట్లు ఉన్నాయి. 2013–14 లో తీసుకున్న రుణాలకు చెల్లించిన వడ్డీలు రూ.5,227 కోట్లు అయితే 2022%–%23 ఆర్థిక సంవత్సరంలో వడ్డీల కింద చెల్లించినవి రూ.21,821 కోట్లు. తొమ్మిది సంవత్సరాల తరువాత వడ్డీల భారం రూ.16వేల కోట్లు అదనంగా పెరిగింది. ఇదీ వడ్డీ చెల్లింపు లెక్క మాత్రమే. తీసుకున్న రుణానికి అసలు ఎంత చెల్లిస్తున్నారనేది తెలుపలేదు. ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచడం కారణంగా కూడా జీతాల చెల్లింపు వ్యయం అనూహ్యంగా పెరిగింది. తొమ్మిది సంవత్సరాల వ్యవధిలో రూ.4,210 కోట్ల నుంచి రూ.15,816 కోట్లకు ఎగబాకింది. ఏ రకంగా చూసినా రిటైర్మెంట్ బెన్ఫిట్స్, పెన్షన్లు, వడ్డీల వ్యయం మూడింతలు పెరగడం ఆందోళన కలిగించే అంశంగా చెప్పుకోవచ్చు. తెలంగాణలో కూడా 2022–23 ఆర్థిక సంవత్సరంలో పన్నులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్, సీఎస్ఎస్ రూపేణా రూ.1,59,350 కోట్లు రాగా ఇందులో నుంచి జీతాలు, పెన్షన్లు, వడ్డీలకు రూ.63,406 కోట్లు చెల్లించారు.

కర్ణాటకలో స్వల్పం.. రాజస్థాన్‌లో అత్యధిక జీతాలు

దేశంలోని అన్ని రాష్ట్రాల లెక్కలు ఒకసారి గమనిస్తే 2012–13 ఆర్థిక సంవత్సరంలో జీతాలు, పెన్షన్లు, రిటైర్మెంట్ బెన్ఫిట్స్, వడ్డీలకు రూ.6,26,849 కోట్లు (వార్షిక బడ్జెట్ లో 46.34 శాతం) ఉండగా పది సంవత్సరాల్లో అనగా 2022–23లో రూ.15,63,649 కోట్లకు (వార్షిక బడ్జెట్ లో 43.49%) పెరిగింది. కొన్ని రాష్ట్రాలు మినహా చాలా రాష్ట్రాలు శాశ్వత నియామకాలు చేపట్టడం లేదు. 2022–23 సంవత్సరంలో జీతాలకు అత్యధికంగా ఉత్తరప్రదేశ్ రూ.60,061 కోట్లు, తమిళనాడు రూ.63,596 కోట్లు చెల్లించాయి. విస్తీర్ణం పరంగా పెద్ద రాష్ట్రం కర్ణాటక రూ.17,817 కోట్లు, పశ్చిమ బెంగాల్ రూ.21,0 06 కోట్లు మాత్రమే చెల్లించడం విశేషం. కరువు రాష్ట్రంగా పేరొందిన చిన్న రాష్ట్రం రాజస్థాన్ రూ.59,378 కోట్లు చెల్లించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వరాష్ట్రం గుజరాత్ లో రూ.13,533 కోట్లు మాత్రమే జీతాలకు చెల్లిస్తున్నారు.

మౌలిక సదుపాయాల్లో కడు దయనీయం

ఏపీలో 2012–13 లో విద్య, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.238 కోట్లు ఖర్చు చేయగా, 2022%–%23 ఆర్థిక సంవత్సరంలో రూ.64 కోట్లకు తగ్గించారు. వైఎస్.జగన్మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రెండేళ్లు అనగా 2020%–%21లో రూ.3,417 కోట్లు, 2021–22 లో రూ.3,176 కోట్లు చొప్పున భారీగా నిధులు ఖర్చు చేశారు. నీటి పారుదల ప్రాజెక్టులకు ఎక్కడ కూడా తగ్గకుండా భారీగా నిధులు కేటాయించి, మంజూరు చేస్తున్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ లకు సంబంధించి వ్యయం అంతంత మాత్రంగానే ఉంది. 2012–13 లో రూ.579 కోట్లు మంజూరు చేయగా, అది కాస్తా 2022–23లో రూ.197 కోట్లకు తగ్గింది. జనాభాలో 80 శాతం వరకు ఉన్న ఈ వర్గాలకు చెందిన మౌలిక వసతుల కల్పనకు నిధులు పెరగాల్సింది పోయి తగ్గించారు. అంటే ఈ వర్గాల ఉన్నతి కోసం ఏమాత్రం శ్రద్ధ చూపించడం లేదనేది తేటతెల్లమవుతోంది.

తెలంగాణలో కూడా నీటి పారుదలకే పెద్దపీట

గత తొమ్మిది ఏళ్ళలో తెలంగాణ ప్రభుత్వం కూడా నీటి పారుదల ప్రాజెక్టులకే పెద్దపీట వేసింది. 2013–14 లో రూ.5,194 కోట్లు వ్యయం చేయగా, 2022%–%23లో రూ.18,916 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి సంవత్సరం కేటాయింపులు పెంచుకుంటూ వచ్చారు. ఈ నిధులతో కొత్త ప్రాజెక్టులను నిర్మాణం చేశారు కాని పెండింగ్ లో ఉన్న పాత ప్రాజెక్టులను పూర్తి చేసే పనికి పూనుకోలేదు. విద్య, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో మౌలిక వసతుల కోసం తొమ్మిది సంవత్సరాలలో ఖర్చు బాగానే పెంచారు. రూ.196 కోట్ల నుంచి రూ.585 కోట్లకు పెరిగింది. డబుల్ బెడ్ రూమ్ పథకం పుణ్యమా అని తొమ్మిది సంవత్సరాలలో ఈ శాఖలో రూ.826 కోట్ల నుంచి రూ.3,026 కోట్లకు నిధులు పెంచారు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు అన్యాయం చేశారు. ఈ నాలుగు వర్గాలకు మౌలిక వసతుల కల్పన కోసం 2013–14 లో రూ.418 కోట్లు వ్యయం చేయగా, 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.245 కోట్లకు కుదించారు. విదేశీ ఆదాయం సమకూర్చే పర్యాటక రంగంపై పూర్తిగా అశ్రద్ధ పెట్టారు. గడచిన ఐదు సంవత్సరాల నుంచి ఒక్క పైసా ఖర్చు చేయకపోవడం శోచనీయం. రాష్ట్రంలో ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నా వాటిని తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం లేదు.

# మెట్రో రైలు దిగిన ఎల్ అండ్ టీ..



హైదరాబాద్, గత కొంతకాలంగా నష్టాలు వస్తున్నాయని, ఇక హైదరబాద్ మెట్రోను తాము నిర్వహించలేమని చెబుతూ వచ్చిన ఎల్అండ్‌టీ.. ఆ బాధ్యతలను నుంచి తప్పుకున్నది. ఏ సమయంలో హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టి టెండర్లు పిలిచారో ఆ క్షణం నుంచి అనేక వివాదాలు, విమర్శలు మొదలయ్యాయి. ఆ తరువాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, కొత్త రాష్ట్రం వంటి సమస్యల నుంచి బయటపడి ఎట్టకేలకు ప్రారంభానికి నోచుకుంది. కరోనా ప్రభావం, ప్రాజెక్టును విస్తరించకపోవడం, స్టేషన్ల నుంచి కనెక్టివిటీ లేకపోవడం వంటి కారణాలతో నష్టాల బాట పట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అంకురార్పణకు నోచుకుని, మళ్లీ కాంగ్రెస్ హయాంలోనే ఈ ప్రాజెక్టు తిరిగి ప్రభుత్వం చేతుల్లోకి వచ్చింది. ఎల్ అండ్ టీ ప్రతినిధులకు, తెలంగాణ ప్రభుత్వం మధ్య చర్చలు ఫలప్రదం కావడంతో హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోకి వచ్చింది.

ఈక్విటీకింద వన్‌టైమ్ సెటిల్‌మెంట్

గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్ అండ్ గ్రూపు సీఎండీ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యం, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఫేజ్ 2 విస్తరణకు ఈక్విటీ పార్ట్ నర్ గా ముందుకు రావాలని కోరగా, సుబ్రహ్మణ్యం సాధ్యం కాదని తెలిపారు. ఫేజ్ 1, ఫేజ్ 2 కారిడార్లలో ఆపరేషన్ లో పాల్గొనాలని, ఆదాయం, పెట్టుబడులు షేర్ చేసుకుందామని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఆపరేషనల్ అగ్రిమెంట్ లో పాలుపంచుకోవడం లేదని ఆయన తెలిపారు. ఫేజ్ 1 లోని కేంద్ర ప్రభుత్వ వాటాను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని, దీంతో పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ సంస్థగా మారుతుందని రేవంత్ రెడ్డి ఎల్ అండ్ టీ కి స్పష్టం చేశారు. ఫేజ్ 1 కింద తమకు రూ.5,900 కోట్లు ఈక్విటీ ఇవ్వాలని సుబ్రహ్మణ్యం కోరగా, వన్ టైమ్ సెటిల్ మెంట్ కింద రూ.2100 కోట్లు చెల్లించేందుకు సీఎం అంగీకారం తెలిపారు. ఎల్ అండ్ టీ కి ఉన్న రూ.13వేల కోట్ల అప్పును చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఓకే చెప్పింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణా రావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సుందీప్ కుమార్ సుల్తానియా, అర్బన్ డెవలప్ మెంట్ సెక్రెటరీ కే.ఇలంబర్తి, హెచ్ఎంఆర్ఎల్ ఎం.డీ సర్ఫరాజ్ అహ్మద్, అడ్వైజర్ (అర్బన్ ట్రాన్స్ పోర్టు) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఎల్ అండ్ టీ గ్రూప్ సీఎండీ అడ్వైజర్ డీ.కే.సేన్, ఎల్ అండ్ టీ మెట్రోరైల్ హైదరాబాద్ లిమిటెడ్ ఎం.డీ కే.వీ.బీ.రెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అపెద్ద పీపీపీ నెట్‌వర్క్

హైదరాబాద్ మెట్రో రైలు ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో ప్రపంచంలోనే అతిపెద్దదిగా గుర్తింపు పొందింది. ఇందుకోసం ఎల్ అండ్ టీ మెట్రో రైలు హైదరాబాద్ లిమిటెడ్ పేరుతో స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ఈక్విటీని కలిగి ఉంది. తొలుత 2008లో బిడ్డింగ్ పూర్తి కావడంతో మైటాస్‌కు అప్పగించగా, 2009 మార్చి నాటికి పనులు ప్రారంభించడంలో విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వం బిడ్డింగ్ రద్దు చేసి తిరిగి టెండర్లు ఆహ్వానించగా ఎల్అండ్‌టీ ఎంపికైంది. 2012 లో భూమి పూజ చేయగా, 2015 లో ట్రయల్ రన్ లు ప్రారంభమయ్యాయి. 2017 లో కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ ఒక రూట్ కు భద్రతా అనుమతులు ఇచ్చింది. 2017 నవంబర్ నెలలో మియాపూర్ స్టేషన్ లో ప్రధాన నరేంద్ర మోదీ మెట్రో రైలుకు జెండా ఊపి ప్రయాణించారు. అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థ, కమ్యునికేషన్ అథారిత రైలు నియంత్రణ, కోచ్ లలో సీసీ టీవీలు, రద్దీ సమయాల్లో రెండు నుంచి ఐదు నిమిషాల మధ్య ఒక రైలు నడిపే వెసులుబాటు ఉంది. మొదటి దశ 2017 లో నాగోల్ %–% అమీర్ పేట %–% మియాపూర్ మార్గంలో ప్రారంభించారు. తరువాత ఎల్.బి.నగర్ %–% అమీర్ పేట 2018 లో, అమీర్ పేట %–% హైటెక్ సిటీ 2019లో ప్రారంభమైంది. జేబీఎస్ %–% ఎంజబీఎస్ మార్గంలో రైళ్ల రాకపోకలు 2020 ఫిబ్రవరిలో మొదలయ్యాయి. మొత్తం 69 కిలోమీటర్ల మార్గం 2020లో అందుబాటులోకి వచ్చి ఫేజ్ 1 మొత్తం పూర్తి చేశారు. మెట్రో లో సగటున నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రూ.22వేల కోట్ల వ్యయంతో పీపీపీ భాగస్వామ్యంతో నిర్మిస్తే కేవలం 3 శాతం మంది ప్రయాణీకుల అవసరాలను తీర్చుతున్నది. ఇంకా 71 శాతం మంది వ్యక్తిగత వాహనాలను వాడడం మూలంగా మెట్రో రైలు లాభాల బాటలో పడలేదనేది వాస్తవం.

రెండో దశకు 2022లో శంకుస్థాపన

రాయదుర్గం– ఎయిర్ పోర్టు కారిడార్ విస్తరణ కోసం 2022 డిసెంబర్ 9న అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయగా, 2025 లోగా రూ.6,250 కోట్లతో పూర్తి చేయాలని అనుకున్నారు. దేశంలోనే 2014 సంవత్సరంలో హైదరాబాద్ మెట్రో రైలు నెట్ వర్క్ (దూరం) లో రెండో స్థానంలో ఉండగా, విస్తరణ లేకపోవడం మూలంగా తొమ్మిదో స్థానానికి దిగజారింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మెట్రో రైలు విస్తరణకు చర్యలు చేపట్టి రెండు ఫేజుల్లో 163 కిలోమీటర్లు పొడిగించాలని నిర్ణయం తీసుకున్నది. ఈ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వంతో పాటు, ఎల్ అండ్ టీ సంస్థతో పలుమార్లు ప్రభుత్వం పెద్దలు చర్చలు జరిపారు. విస్తరణలో పాల్గొనాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ ని కోరింది. ఫేజ్ 2ఏ, 2బీ విస్తరణలో పాల్గొనడం లేదని, అనేక సమస్యలు ఉన్నాయని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వివాదంపై నవంబర్ 2024 నుంచి సందిగ్ధత ఏర్పడింది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుతో తమకు నష్టం కలిగిందని, ఆ డబ్బులు సమకూర్చితే వైదొలుగుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఘాటుగా స్పందించారు. కేంద్ర మంత్రి జీ.కిషన్ రెడ్డి బీఆర్ఎస్ నేతలు చెప్పినట్లు ఆడుతున్నారని, మెట్రో రైలు విస్తరణకు అడ్డంకులు కల్పిస్తున్నారని ఆరోపించిన విషయం తెలిసిందే.

# శ్రీశైలం,సాగర్‌లకు పెరుగుతున్న పర్యాటకులు

నాగార్జునసాగర్,నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నిండుకుండలా దర్శనిమిస్తోంది. చాలాకాలం తరవాత మళ్లీ జలకళ సంతరించడంతో పర్యాటకుల రాక పెరిగింది. పూర్తిస్థాయి నీటిమట్టం చేరుకోవడంతో జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులలు కాగా 587 అడుగుల వద్ద నిలకడగా ఉండేలా చూస్తున్నారు. దీంతో నిండుకుండ ను తలపిస్తోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు దాదాపు పూర్తిస్థాయిలో నిండడంతో తిలకించేందుకు పర్యాటకులు పోటెత్తుతున్నారు. శ్రీశైలం జలాశయం కూడా నిండుకుండలా మారింది. ఎగువన వర్షాలతో మరింతగా వరదవచ్చి చేరుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, విదేశీయులు నందికొండకు తరలిరావడంతో లాంచీ స్టేషన్, బుద్ధవనం, నాగార్జునకొండ పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిట లాడాయి. చాలా మంది పర్యాటకులు నాగార్జునకొండకు వెళ్లేందుకు ఆసక్తి కనబర్చగా అందుకు అనుగుణంగా తెలంగాణ టూరిజంశాఖ లాంచీలను నడిపించింది. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకోవడం, ఉభయ రాష్ట్రాల తెలుగు ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులు అన్ని నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్ రిజర్వాయర్ గరిష్ట స్థాయికి చేరినందున ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరందించే అవకాశం ఉంది. సాగర్ నిండడంతో రిజర్వాయర్ పరిధిలో మత్స్యకార్మిక కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రిజర్వాయర్‌లోకి సమృద్ధిగా వచ్చి చేరిన కృష్ణమ్మ చూసి సంబుర పడుతున్నారు. సాగర్ లోతట్టు ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పర్చుకున్న గంగపుత్రులతో పాటు, చేపల వృత్తే జీవనాధారంగా మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేటకు ఉపక్రమిస్తున్నారు. ఇరవైకి పైగా మర బోట్లు, పుట్టీలు ఉండగా వాటిల్లో చేపల వేటకు వెళ్తారు. కుటుంబ సభ్యులంతా ఇదే వృత్తిపై ఆధారపడి నిత్యం రూ.వేలల్లో ఆదాయం పొందుతారు. వేటాడిన చేపలు కేరళ, కోల్‌కత్తా తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. లోతట్టు ప్రాంతం వెంట జీవనం సాగిస్తున్న గిరిజనం సైతం చాలావరకు చేపల వేటను వృత్తిగా చేసుకుని బతుకుదెరువును సాగిస్తున్నది. ప్రభుత్వం వీరికి కూడా లైసెన్స్‌లు జారీచేసి ప్రభుత్వం పరంగా చేయూతనిస్తోంది. సాగర్ నిండటంతో గిరిజనులకు సైతం ఉపాధి మెండుగా కలుగుతున్నది. కృష్ణా నదిలో మత్స్యకారులు ఏడాదిలో 300 రోజులపాటు చేపల వేటను కొనసాగిస్తారు. గతకొంతకాలం చేపలవేటకు దూరమైన మత్స్యకారులు రిజర్వాయర్‌లోకి భారీగా వచ్చిన నీటితో తిరిగి చేపల వేటకు సన్నద్ధం అవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గతేడాది రిజర్వాయర్‌లోకి భారీగా చేప పిల్లలను వదలడం.. అవి పెరిగి పెద్దవ్వడంతో పుష్కలంగా ఆదాయం వస్తుందని వారు చెబుతున్నారు.

# ఉల్లిధరలతో కర్నూలు రైతు దిగాలి

కర్నూలు,రాష్ట్రంలో ఉల్లి ఘాటు క్రమంగా పెరగాల్సిన ప్రస్తుత సీజన్‌లో రైతులు దిగాలు పడ్డారు. ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నా, రైతులకు మాత్రం గిట్టుబాటు కావడం లేదు. 1200కు క్వింటా అని ప్రభుత్వం చెప్పినా ఆ ధరలు కూడా రావడం లేదంటున్నారు. గత కొన్ని రోజులుగా ధరలు పతనం అవుతున్నాయి. ఇటీవల 25 రూపాయలు ఉన్న ధరలు ఏకంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవలి వర్షాల కారణంగా ఉల్లి సరఫరా ఆగిపోయిందని అంటున్నారు. గతేడాదితో పోలిస్తే మార్కెట్‌లకు 4–5 వేల క్వింటాళ్ల మేర సరఫరా తగ్గిపోయింది. అయినా రైతులకు మాత్రం ధరలు దక్కడం లేదు. దీంతో హోల్‌సేల్ ధరే కిలో రూ. 20 నుంచి 25కి చేరింది. కర్నూలు జిల్లాలో మార్కెట్‌లోకి ఉల్లి ఈ యేడు భారీగా చేరింది. వర్షాల పరిస్థితుల కారణంగా ఉల్లి సాగు అనుకున్నంత జరిగినా ధరలు మాత్రం పెరగడం లేదని అంటున్నారు. పొరుగు రాష్ట్రాల్లో ఇటీవలి వర్షాలు, వరదల కారణంగా దిగుబడి తగ్గడంతో ధర కొండెక్కుతుందని భావించారు. దీంతో ఇక్కడి రైతులకు డిమాండ్ వస్తుందని భావించారు. ఈ యేడు దేశంలో ఉల్లి సాగు విపరీతంగాపెరగడంతో ధరలు దిగివచ్చాయి. కేవలం పది రోజుల వ్యవధిలోనే కిలో ఉల్లి ధర రూ. 10 నుంచి రూ. 15 వరకు మాత్రమే అమ్ముడవతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో 20 రూపాయలు పలుకుతుండగా ఇది మరింత పెరిగే అవకాశం లేదు. రాష్ట్రంలో ప్రధానంగా ఉల్లి సాగు గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి, వికారాబాద్, కొంతమేర కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సాగవుతుంది. రాష్ట్రం నుంచి వస్తున్న ఉల్లితో పూర్తిస్థాయిలో అవసరాలు తీరే అవకాశం లేకపోవడంతో పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వచ్చేది. సాధారణంగా రాష్ట్ర మార్కెట్‌లకు మహారాష్ట్రలోని షోలాపూర్, ఔరంగాబాద్, నాసిక్, కర్ణాటకలోని శివమొగ్గ, రాయచూర్ ప్రాంతాలు, మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి దిగుమతులు ఉంటాయి. అలాగే ఏపీలోని కర్నూలు నుంచి కూడా ఉల్లి సరఫరా అవుతుంది. అయితే ఈ ఏడాది మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురిసిన కుండపోత వర్షాలతో ఉల్లి సాగుకు భారీ నష్టం వాటిల్లింది. కానీ కర్నూలు రైతులు విపరీతంగా సాగు చేయడంతో దిగుబడులు పెరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి వ్యాపారులు నిల్వలు పెంచడంలేదు. మొత్తంగా దిగుబడులు పెంచిన కర్నూలు రైతులు ధరలు లేక డీలా పడ్డారు.

# దేవాదాయ భూములను రక్షించండి

హైదరాబాద్, దేవాదాయ శాఖ భూముల పరిరక్షణ విషయంలో హైడ్రా సాయం చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. దేవాదాయ శాఖ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పరిక్షించేందుకు ఇప్పటికే డీజీపీఎస్ సర్వే చేపడుతున్నట్టు చెప్పారు. మంత్రి కొండా సురేఖతో గురువారం సచివాయలంలోని మంత్రి చాంబర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ భేటీ–అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ బతుకమ్మ కుంట పునరుద్ధరణ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మంత్రి అభినందించారు. బతుకమ్మ కుంట పునరుద్దరణ విజయంతంగా పూర్తి చేసినందుకు శభాష్ అంటూ కితాబు ఇచ్చారు. అయితే, తన పరిధిలో ఉన్న దేవాదాయ శాఖలోని భూముల పరిరక్షణకు హైడ్రా సాయం అవసరమని మంత్రి గుర్తు చేయగా ముఖ్యమంత్రి అనుమతితో చర్యలు తీసుకుంటామని రంగనాథ్ వివరణ ఇచ్చారు. అందుకోసం ప్రభుత్వ పరంగా శాఖ పరంగా కావాల్సిన సాంకేతిక అంశాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. హైడ్రా వచ్చాక చేపట్టిన పనుల వివరాలను రంగనాథ్ మంత్రికి సమగ్రంగా వివరించారు. అయితే, మంచి పనులు చేసే సందర్భంగా కొన్ని ఇబ్బందులు ఎదరవుతాయని అన్నారు. కానీ సామూహిక ప్రయోజనంలో భాగంగా చేశారని మంత్రి సురేఖ కొనియాడారు. హైడ్రా చేస్తున్న పనులు రానున్న కాలంలో అందరికీ తెలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వరంగల్ నాలాల ఆక్రమణలను కూడా రంగనాథ్‌తో చర్చించారు. వాటిని పరిష్కరించేందుకు తమకు సహకరించాలని కోరారు. అందుకు ఆయన సుముఖత తెలిపారు. కాగా, బతుకమ్మ కుంట వేడుకలకు మంత్రి సురేఖను రంగనాథ్ ఈ సందర్భంగా ఆహ్వానించారు.

# అంగన్‌వాడీలపై ప్రభుత్వం దాష్టీకం

హైదరాబాద్:అంగన్‌వాడీ టీచర్లపై రేవంత్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఛలో సెక్రటేరియట్ పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి, కర్కషంగా వ్యవహరించడాన్ని ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామంటూ బీరాలు పలికిన రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడిక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడం సిగ్గుచేటు- అని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఉద్యోగులకు గౌరవం లేదా... గుర్తింపు లేదా..? అని ప్రశ్నించారు. ప్రజా పాలన అని రాక్షస పాలన కొనసాగిస్తారా..? అని నిలదీశారు. ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ సంబురం లేకుండా చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారి ఉసురు తగులుతుందని అన్నారు.అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కెసిఆర్ వారు వర్కర్లు కాదని, అంగన్‌వాడీ టీ-చర్లు అని పోస్టును ఉన్నతీకరించి వారి గౌరవాన్ని పెంచారని గుర్తు చేశారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీ-చర్లకు కేవలం రూ. 4,200, వారి సహాయకులకు రూ. 2,200 వేతనం లభించేదని, కానీ బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీ-చర్ల వేతనాన్ని రూ. 13,650లకు, మినీ అంగన్ వాడీ టీ-చర్ల వేతనాన్ని రూ. 7,800లకు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ. 7,800 లకు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారని చెప్పారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని 18,000లకు పెంచుతామని, ఇపిఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. మాయ మాటలు చెప్పి, 22 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీ లేదు, గతీ లేదని విమర్శించారు. మహాలక్ష్మి పేరిట సిఎం అమలు చేస్తున్న ఉచిత బస్సుల్లోనే జిల్లాల నుంచి సచివాలయం వద్దకు వచ్చి మిమ్మల్ని నిలదీస్తున్నారని, రేవంత్‌రెడ్డి మోసపూరిత వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అరెస్టులు చేసిన అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీష్‌రావు బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

## వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్, తెలంగాణలో రానున్న రెండ్రోజులపాటు- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలపై నిరంతరం మానిటర్ చేయాలని సూచించారు. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని, నిరంతరం జాగ్రత్తగా ఉండాలని అధికారులను రేవంత్ ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని కోరారు. అవసరమైతే లోతట్టు- ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అన్ని కాజ్ వేలను పరిశీలించాలని, రోడ్లపై వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగానే ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలన్నారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించటంతో పాటు-, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యా సంస్థలు కూడా వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతోపాటు-, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇదిలావుంటే హైదరాబాద్ నగరంలో మళ్లీ వర్షం మొదలైంది. గురువారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అమీర్ పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, బేగంపేట, ప్యాటీన, పారడైజ్, సికింద్రాబాద్, కోఠి, అబిడ్స్, చాదర్ ఘట్, మలక్ పేట్ తదితర ప్రాంతాల్లో వాన పడింది. గత వారం రోజులుగా అకాశమంతా మబ్బులుగా ఉంటూ అక్కడక్కడ వర్షం కురుస్తోంది. ఇక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చిరికలు జారీ చేసింది. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి వర్షాలపై స్పందించారు. రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని జిల్లా కలెక్టర్లకు సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## గెల్చుడా చీల్చుడా ?

పాట్నా:బీహార్ ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. దసరా తరువాత షెడ్యూల్ ప్రకటించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. నవంబర్ లో ఎన్నికలు జరిగేందుకు వీలుంది. ఎట్టి పరిస్థితుల్లో నవంబర్ 22వ తేదీలోగా కొత్త శాసనసభ సమావేశం అయి తీరాలి. పాత అసెంబ్లీ కాల పరిమితి ముగుస్తోంది. దాంతో గట్టిగా అంటే ఎన్నికలకు నలభై యాభై రోజుల వ్యవధి కూడా లేదు. మరి బీహార్ లో రాజకీయ చిత్రం ఎలా ఉంది అంటే చాలానే విషయాలు చెప్పుకోవాల్సి ఉంది.

హోరా హోరీగా :

బీహార్ లో అధికారంలో ఉన్న ఎన్డీయేకు విపక్షంలో ఉన్న ఇండియా కూటమికి మధ్య హోరాహోరీ పోరు ఈసారి జరగనుంది అని అంటున్నారు. ఈ రెండు కూటముల మధ్య స్వల్పమైన తేడాయే ఉంది అని తాజా సర్వేలు చెబుతున్నాయి. ఒకటి రెండు శాతం ఓట్లు అటు నుంచి మారితే రాజకీయ జాతకమే మారిపోతుంది అని అంటున్నారు. దాంతో బీహార్ లో రాజకీయం ఎవరి మెడలో వరమాల వేస్తుంది అన్నది ఉంది. మరో వైపు చూస్తే ఈసారి పక్కాగా అధికారం దక్కించుకోవాలని ఇండియా కూటమి చేయని ప్రయత్నాలు లేవు.

కాంగ్రెస్ ఫుల్ ఫోకస్ :

కాంగ్రెస్ ఉత్తరాది రాష్ట్రాల్లో పూర్వ వైభవం సాధించాలని చూస్తోంది. 1989 నుంచి బీహార్ యూపీ చేజారి పోయి కాంగ్రెస్ ని దూరం పెట్టాయి. అలాంటి చోట్ల తమ ప్రభావం చూపిస్తే కనుక 2029 ఎన్నికల్లో కేంద్రంలో అధికారం తమదే అని భావిస్తోంది హస్తం పార్టీ. అందుకే రాహుల్ ఓటర్ అధికార యాత్రలు అలాగే ఏకంగా బీహార్ లోనే సీడబ్ల్యూసీ మీటింగులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా ఆర్జేడీతో పొత్తు కలసివస్తుందని చూస్తున్నారు.

ఎన్డీయే ధీమా అదే :

ఎన్డీయేకు మోడీ అతి పెద్ద ఆకర్షణ. ఇక జీఎస్టీ 2.0తో మధ్యతరగతి వర్గాలలో మంచి ఆదరణ దక్కుతుందని కూడా లెక్కవేసుకుంటున్నారు. అంతే కాదు బీహార్ లో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని అవి ఓటు బ్యాంక్ ని తెప్పిస్తాయని చూస్తోంది. నితీష్ కుమార్ రాష్ట్రంలో బడా నాయకుడిగా ఉండడం మరో అడ్వాంటేజ్ గా తీసుకుంటోంది. ఈ లెక్కన తమదే మరోసారి అధికారం అని ఎన్డీయే భావిస్తోంది.

పీకే తులాభారం :

ఈ క్రమంలో పీకే అలియాస్ ప్రశాంత్ కిశోర్ కొత్తగా పార్టీ పెట్టి జనంలోకి వచ్చారు. జన సురాజ్ పార్టీతో చాలా ముందుగానే ఆయన జనంలో ఉన్నారు. ఆయన పార్టీ ప్రభావం కూడా ఈసారి ఎన్నికల్లో ఉంటుందని సర్వేలు చెబుతున్నాయి. ఆయనకు అధికారం దక్కకపోయినా గణనీయంగా ఓట్లను చీలుస్తారు అని అంటున్నారు. ముఖ్యంగా కొత్తగా రాజకీయాలను చూడాలనుకునే వారు యువత అంతా పీకే పార్టీ వైపు ఆకర్షితులు అవుతున్నారని అంటున్నారు. దాంతో పీకే పార్టీ దండీగానే ఓట్లను చీలుస్తుంది అని విశ్లేషణలు ఉన్నాయి.

# ఉపాధ్యాయులకు టెట్ ని'బంధనలు'




హైదరాబాద్,వెంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లుంది విద్యా హక్కు చట్టం అమలుపై సుప్రీంకోర్టు తీర్పు. విద్యా హక్కు చట్టం- 2009 సెక్షన్ 23(1) ఆధారంగా జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సిటిఇ) 23-ఆగస్టు, -2010 నోటిఫికేషన్ ప్రకారం ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేసింది. టెట్ అంశం పై 'అంజుమన్ ఇషాత్-ఎ-తలీమ్ ట్రస్ట్ %జం% స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర %ఒ% ఆర్స్' కేసు విషయంలో జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ ఉపాధ్యాయులుగా నియమించబడ్డ వారు ప్రస్తుతం సర్వీస్ కొనసాగించాలన్నా, పదోన్నతి పొందాలన్నా టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిందేనని ఇటీవల తీర్పునిచ్చింది. ఈ తీర్పు నేపథ్యంలో దేశవ్యాప్తంగా 25 లక్షలమంది ఉపాధ్యాయులు, తెలంగాణలో 70 వేలమంది ఉపాధ్యాయులు, ఆంధ్రప్రదేశ్‌లో లక్ష మంది ఉపాధ్యాయుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 1.5 లక్షల మంది ఉపాధ్యాయులలో ఆందోళన నెలకొని ఉంది.ఎప్పుడో 20, 25 సంవత్సరాల క్రితం పాఠశాల ఉపాధ్యాయులుగా నియమించబడ్డ వారు ప్రస్తుతం సర్వీసు కొనసాగించాలన్నా, పదోన్నతి పొందాలన్నా ఈ వయసులో టెట్‌రాసి ఉత్తీర్ణత సాధించడం సాధ్యమవుతుందా?. ఐదు సంవత్సరాలు కన్నా ఎక్కువ సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగంలో కొనసాగాలన్నా, ఐదు సంవత్సరాలకు తక్కువ సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు పదోన్నతి పొందాలన్నా టెట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలనే సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 15 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేవలం 2012 డిఎస్‌సి, 2017 టిఆర్‌టి, 2024 టిఆర్‌టి ద్వారా నియామకమైన సుమారు 30 వేల మంది ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ అర్హత ఉంది. ఇప్పటికే సుమారు 20 వేల మంది ఉపాధ్యాయులు టెట్ పాస్ అయి ఉండవచ్చు. మొత్తంగా 50 వేల మంది ఉపాధ్యాయులు మాత్రమే టెట్‌లో అర్హత కలిగి ఉన్నారు. సుమారు 70 వేల మంది ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయలేదు. టెట్ అర్హత నేపథ్యంలో రెండు సంవత్సరాల్లో టెట్ పాస్ కావాలన్నా నిర్ణయం వల్ల, పదోన్నతులకు టెట్ కచ్చితంగా పాస్ కావాలనే షరతు వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రమవుతుంది. దాని వల్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు నష్టపోతారు.

ప్రధానోపాధ్యాయుల, ఇతర శాఖలలో పదోన్నతుల కోసం జిఒ టిఇఒటి లాంటి శాఖాపరమైన పరీక్షలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. అదే మాదిరి విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చినప్పటి (2010) నుంచే ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయ పదోన్నతులకు కూడా టెట్ తప్పనిసరి చేస్తూ అమలు చేసి ఉంటే ప్రారంభంలోనే ఉపాధ్యాయులు దానిపై దృష్టి పెట్టి పరీక్షలు రాసి పాస్ అయ్యి ఉండేవారు. 2010లోనే ఎన్‌సిటిఇ ఈ నిబంధనలు అమలులోకి తెచ్చింది. 2012, 2017, 2024 ఉపాధ్యాయ నియామకాల్లో ఈ నిబంధనలు అమలు చేసిన విద్యాశాఖ పదోన్నతిలో కూడా ఎందుకు అమలు చేయలేదు? విద్యా హక్కు చట్టం ప్రకారం పదోన్నతిలో టెట్ తప్పనిసరి కావడంతో 2015 లోపు ఉత్తీర్ణులు కావాలని ఎన్‌సిటిఇ గడువు ఇచ్చింది. అయినా ఆ దిశగా విద్యాశాఖ చర్యలు ఎందుకు తీసుకోలేదు? మరొకసారి సుమారు 4 సంవత్సరాల గడువు పెంచుతూ 2019 వరకు ఉత్తీర్ణులు కావాలని ఎన్‌సిటి ఉత్తర్వులు జారీ చేసింది. అయిన అప్పుడెందుకు విద్యా శాఖ అమలు చేయలేదు? పరిష్కారం ఏమిటి? విద్యాహక్కు చట్టం -2009 సెక్షన్ 23 (2) ప్రకారం టెట్‌కు తాత్కాలిక మినహాయింపు ఇవ్వవచ్చు. కాబట్టి 23 -ఆగస్టు -2010 కంటే ముందు నియామకమైన ఇన్స్ సర్వీసు టీచర్లకు సర్వీసు లో కొనసాగడానికి, ప్రమోషన్ పొందడానికి టెట్ నుంచి పూర్తి మినహాయింపు ఇచ్చే విధంగా చట్ట సవరణ చేయాలి.అది సాధ్యం కాకపోతే 44 సంవత్సరాలు దాటిన వారికి టెట్ రాసే అర్హత లేదు, కాబట్టి సుమారు 20, 25 సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఉపాధ్యాయులకు వారి బోధన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ వయసులో వారికి ఉన్న బరువు, బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని 45 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులకు ప్రస్తుతం ఉద్యోగంలో కొనసాగడానికి, 50 సంవత్సరాలు దాటిన వారికి పదోన్నతి పొందడానికి టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలి. లేదా ప్రస్తుతం ఉద్యోగంలో కొనసాగుతూ టెట్ పాస్ కావడానికి ఐదు సంవత్సరాలు, పదోన్న తర్వాత టెట్ పాస్ కావడానికి మూడు సంవత్సరాల సమయాన్ని ఇవ్వాలి. ప్రస్తుతం పేపర్ 2 అభ్యర్థులు రాస్తున్న టెట్‌లో ఉపాధ్యాయులు అర్హత సాధించడం కొంత కష్టం. ఎందుకంటే ఉపాధ్యాయులు పదోన్నతి పొందే సబ్జెక్టులో తప్పనిసరిగా డిగ్రీ లేదా తత్సంబంధ అర్హత సాధించి ఉంటారు. కొందరైతే పిజి అర్హత సాధించి ఉంటారు. టెట్‌లో ఆ సబ్జెక్టులో ఎంత కఠినమైన ప్రశ్నలు అడిగిన సమాధానాలు రాయగలరు. కాబట్టి సులభంగానే టెట్ పాస్ కాగలరు. కానీ పేపర్ 2 అభ్యర్థులు రాస్తున్న టెట్‌లో అడుగుతున్న ప్రశ్నలు విచిత్రంగా ఉన్నాయి. సాంఘిక శాస్త్ర పదోన్నతి కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయులకు టెట్ లో తెలుగు పరిజ్ఞానాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి.జీవశాస్త్ర పదోన్నతి కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయులు టెట్‌లో గణిత సంబంధ ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. గణిత శాస్త్ర పదోన్నతి కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయుడు టెట్‌లో జీవశాస్త్ర సంబంధ ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. 20, 25 సంవత్సరాల సర్వీసు ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు ఇప్పుడు తమ సబ్జెక్ట్ కాకుండా ఇతర సబ్జెక్టను ఎలా ప్రిపేర్ కాగలరు. టెట్ అర్హత లేకుండా సర్వీస్ లో కొనసాగించనీ యెడల, పదోన్నతి ఇవ్వని పక్షంలో ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి. సాధారణంగా నిర్వహించే టెట్‌లా కాకుండా ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు వారు బోధించబోయే సబ్జెక్టునీ, బోధన అనుభవాన్ని, బోధన మెలకువలను పరీక్షించే విధంగా సులభతరంగా ఉండేటట్లు ప్రత్యేక టెట్ నిర్వహించాలి. ఇంకా అవసరమైతే జిఒటిఇఒటి మాదిరి చూసి రాసే పద్ధతిలో టెట్ నిర్వహించాలి. సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వం వలే సెప్టెంబర్ 30 లోపు రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలి. కేంద్ర ప్రభుత్వపై ఒత్తిడి తెచ్చి విద్యకు హక్కు చట్టం -2009 సెక్షన్ 23 కి సవరణలు చేయాలి. ఎన్‌సిటి ఈ నిబంధనలు మార్చాలి. దేశ వ్యాప్తంగా 25 లక్షల మంది ఉపాధ్యాయులు, తెలంగాణలో 70 వేల మంది ఉపాధ్యాయులు, ఆంధ్రప్రదేశ్‌లో లక్ష మంది ఉపాధ్యాయుల భవిష్యత్‌ను ప్రభుత్వాలు కాపాడాలి.

### ఆగివున్న లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

నిజామాబాద్,నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండలం సుద్దపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 44 వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. లారీని ఢీకొట్టిన తర్వాత డివైడర్ పైకి ట్రావెల్స్ బస్సు దూసుకెళ్లింది. ఈ సకనమాదం పది మంది గాయడడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు యూ-టర్న్ తీసుకుంటుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# లద్దాఖ్‌లో మరో జెన్‌జెడ్ విప్లవం?



కేంద్ర ప్రాంతమైన లద్దాఖ్ ఆందోళనలతో భగ్గుమంటోంది. కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్రహోదా కల్పించాలని, భారత రాజ్యాంగం లోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని బుధవారం (24.9.25) నాడు జనం ముఖ్యంగా యువత చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారి ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆందోళనకారుల డిమాండ్లు ఏమిటి? ఎందుకు ఇది నేపాల్‌లోని జెన్‌జెడ్ విప్లవం రీతిలో ఉధృతమైంది? కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? ఇవన్నీ లోతుగా పరిశీలించవలసి ఉంది. 2019 లో ఆర్టికల్ 370 ను రద్దు చేయడంతో జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా లేకుండాపోయింది. జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. ఆ సమయంలో చాలా మంది కేంద్రం తీసుకున్న ఈ చర్యలను సమర్థించారు. అయితే ఏడాది తరువాత పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. కేంద్ర పాలిత ప్రాంతంగా లద్దాఖ్ ఏర్పాటైన తరువాత రాజ్యాంగ హక్కుల రక్షణ కోల్పోయిందని, అన్నిటికీ కేంద్ర ప్రభుత్వమే పెత్తనం వహిస్తోందన్న ఆందోళన చెలరేగింది. ప్రత్యక్ష కేంద్ర పాలనకు వ్యతిరేకంగా అశాంతి పెరిగింది. తమ భూమి, సంస్కృతి, వనరులను కాపాడుకోవాలన్న స్థిరమైన అభిప్రాయం విప్లవంగా రూపొందింది.లద్దాఖ్ లోని రెండు ప్రధాన వర్గాలైన బౌద్ధ, ముస్లిం వర్గాలను కలుపుకుని లేహ్ అపెక్స్ బాడీ (ఎల్ఎబి), కార్గిల్ డెమోక్రటిక్ అలయన్స్(కెడిఎ) ఉమ్మడి పోరాటం చేపట్టాయి. 1. లద్దాఖ్‌కు రాష్ట్రహోదా కల్పన 2. స్థానిక ఉద్యోగ నియామకాల కోసం ప్రత్యేక పబ్లిక్ సర్వీస్ కమిషన్ 3. ప్రస్తుతం ఉన్న ఒకే ఒక పార్లమెంట్ స్థానానికి బదులుగా రెండు పార్లమెంట్ నియోజకవర్గాల ఏర్పాటు 4. భూమి, సంస్కృతి, ఉద్యోగాల రక్షణ కోసం లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్ కింద చేర్చడం ఈ నాలుగు డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందు ఆందోళనకారులు పెట్టారు. లద్దాఖ్ ప్రజలు తమ రాజకీయ స్వయం ప్రతిపత్తిని కోల్పోయారని, తమ సంస్కృతి, జీవన విధానాన్ని కాపాడుకోవాలంటే పూర్తిస్థాయి రాష్ట్రహోదా తప్పనిసరి అని డిమాండ్ చేస్తున్నారు. రాజ్యాంగం లోని ఆరో షెడ్యూల్‌లో ఆర్టికల్ 244(2), ఆర్టికల్ 275 (1) ఉన్నాయి. ఆర్టికల్ 244(2) అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరం రాష్ట్రాల్లోని షెడ్యూల్డ్ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు సంబంధించిన పరిపాలనను నియంత్రిస్తోంది.ఈ రాష్ట్రాల్లో గిరిజన హక్కులను రక్షించడం దీని ముఖ్య ఉద్దేశం. ఇక ఆర్టికల్ 275(1) షెడ్యూల్డ్ తెగల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రాలకు నిధులు అందజేయడానికి తోడ్పడుతుంది. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, రోడ్ల అనుసంధానం, విద్యుత్ సరఫరా, గృహనిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. నిధుల పంపిణీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనల ఆధారంగా జరుగుతుంది. గిరిజన విద్యార్థుల కోసం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళు ఏర్పాటుకు ఈ నిధుల నుంచి కొంతభాగం కేటాయించబడుతుంది. ఇవన్నీ ఆరో షెడ్యూల్ అమలైతేనే వర్తిస్తాయి. అందుకనే లద్దాఖ్ ప్రజలు తమకు రాష్ట్ర హోదాతోపాటు ఆరో షెడ్యూల్‌ను జత చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం లద్దాఖ్ లోని నిరుద్యోగ రేటు 26.5 శాతంగా ఉంది.ఇది దేశంలోనే రెండో అత్యధిక శాతంగా చెబుతున్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడానికి, ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. భౌగోళిక సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా రెండు పార్లమెంట్ నియోజక వర్గాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ డిమాండ్లు అన్నిటిపై కేంద్ర హోం మంత్రిత్వశాఖతో గత ఏడాది డిసెంబర్ నుంచి లేహ్ అపెక్స్ బాడీ చర్చలు జరుపుతోంది. గతంలో లేహ్ అపెక్స్ బాడీ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 35 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారు కూడా. ఇప్పుడు కూడా ఆయన నిరాహార దీక్ష సాగించారు. కానీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. 'గత ఐదు సంవత్సరాలుగా యువత నిరుద్యోగులుగా ఉన్నారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. యువత నిరుద్యోగులుగా మారడం, వారి ప్రజాస్వామిక హక్కులను లాక్కోవడం అనేది సామాజిక అశాంతికి కారణమని తాను ఎప్పుడూ చెబుతూనే ఉన్నాను, నేడు ఇక్కడ ప్రజాస్వామ్య వేదిక లేదు. మాకు హామీ ఇచ్చిన ఆరో షెడ్యూల్‌ను ఎవరూ పట్టించుకోవడం లేదు.పదేపదే హామీలు ఇచ్చినప్పటికీ కేంద్ర హోం మంత్రిత్వశాఖ దాదాపు రెండు నెలలుగా స్థానిక ప్రతినిధులతో చర్చలు జరపడం లేదు' అని వాంగ్‌చుక్ ఈ సందర్భంగా ఆందోళన వెలిబుచ్చడం గమనార్హం. లద్దాఖ్ ప్రజల డిమాండ్లలో కొన్నిటికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రత్యేక సర్వీస్ కమిషన్, రెండు పార్లమెంటరీ నియోజక వర్గాల ఏర్పాటు చేయడానికి సుముఖంగా ఉన్నా లద్దాఖ్‌కు రాష్ట్రహోదా కల్పించడం, ఆరో షెడ్యూల్ కింద చేర్చడం వంటి కీలక డిమాండ్లపై మాత్రం ఇంకా అంగీకరించకపోవడమే తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. కేంద్ర ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేస్తోందన్న అసంతృప్తి యువతలో బాగా నాటుకుంది. ఒకప్పుడు శాంతియుతంగా నిరసనలు చేసిన లద్దాఖ్‌లో ప్రస్తుతం తీవ్ర ఆందోళనలు చెలరేగడానికి కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆందోళనకారులు ఆరోపిస్తున్నారు. అయితే చర్చలు తిరిగి ప్రారంభించడానికి అక్టోబర్ 6న ప్రతినిధులతో సమావేశం కావడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం కూడా ఏకపక్ష నిర్ణయమేనని ఆందోళనకారులు ధ్వజమెత్తుతున్నారు.

## అంగన్‌వాడీలకు దసరా సెలవులు

హైదరాబాద్, రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నెల 27 నుంచి అక్టోబర్ 4 వరకు ఎనిమిది రోజుల పాటు- దసరా సెలవులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్వాడీల చరిత్రలో తొలిసారిగా దసరా సెలవులు ఇవ్వడం ఇదే ప్రథమం. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే దసరా, బతుకమ్మ పండగలు జరుపుకునే విధంగా దసరా సెలవులు మంజూరు చేయాలని ఐఎన్టీయూసీ అనుబంధ తెలంగాణ స్టేట్ ఇందిరా ప్రియదర్శిని అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బి.అన్నపూర్ణ, ఇతర ప్రతినిధుల బృందం మంత్రి సీతక్కను ప్రత్యేకంగా కలిసి ఇటీ-వల విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సీతక్క సెలవులు మంజూరు చేయించారు. ఈ మేరకు 27 నుంచి అక్టోబర్ 4 వరకు దసరా సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ టేక్ హోమ్ రేషన్ విధానంలో లబ్ధిదారులకు యథావిధిగా పోషకాహారాన్ని అందజేయాలని సూచించారు. అంగన్వాడీలకు సెలవులు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు అంగన్వాడీ టీ-చర్లు, హెల్పర్లు కృతజ్ఞతలు తెలిపారు. 8 రోజుల పాటు- అంగన్‌వాడీ కేంద్రాలు మూసి ఉండనున్నాయి.

## ఖమ్మంలో నిరుద్యోగ యువత ర్యాలీ

ఖమ్మం, జిల్లా కేంద్రంలో నిరుద్యోగ యువత కదం తొక్కారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, యూత్ డిక్లరేషన్, రెండు లక్షల ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని నినాదాలు చేశారు. దీంతో ఖమ్మం వీధులు నిరుద్యోగుల నినాదాలతో మార్మోగిపోయాయి. ఖమ్మం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొన్న మానుకోటలో, ఈ రోజు ఖమ్మంలో నిరుద్యోగ యువత రోడ్డెక్కిన తీరు చూస్తుంటే రేవంత్ రెడ్డి ఉద్యోగం త్వరలో ఊడిపోవడం ఖాయమనిపించిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఓట్ చోరీ జరిగిందని దేశమంతా ప్రచారం చేస్తున్నారు. కానీ, అసలైన ఓట్ చోరీ తెలంగాణలో జరిగింది అదే నిరుద్యోగు యువత ఓట్ల చోరీ అని విమర్శించారు.గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 10 ఏళ్లు అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీ ఎక్కడ అధికారం పోతుందేమో అన్న భయంతో నోటికొచ్చిన హామీ ఇచ్చింది. కానీ, తమకు ఉద్యోగాలు రాగానే నిరుద్యోగులను మరిచిపోయారు. ఎన్నికల్లో ప్రచార సామగ్రిని ఎలా వాడుకొని వదిలేస్తారో అలాగే నిరుద్యోగులను సైతం ప్రచారానికి బస్సు యాత్రలకు వాడుకొని వదిలేశారు. గ్రూప్ -1 ఉద్యోగాల రూపంలో తెలంగాణ ఉద్యోగాల చోరీ కూడా బట్టబయలు అయింది. ఇప్పుడు ఆ ఓట్ల చోరీని కప్పిపుచ్చుకోవడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్ముతో నిరుద్యోగులను ఓడించడానికి లాయర్లకు కోట్లు- ఖర్చు చేస్తుంది అని రాకేశ్ రెడ్డి ఆరోపించారు.

## కొత్త సవాల్...

లద్దాఖ్: ఇది విచిత్రమైన వ్యవహారంగానే అంతా చూస్తున్నారు. కాశ్మీర్ ఎపుడూ ఉద్రిక్తలకు నిలయంగా ఉంటుంది. అక్కడే ఎక్కువగా అలజడులు రేగుతూ ఉంటాయి. కానీ మంచుతో మంచిగా ఉంటే ఉండే లద్దాఖ్ మంటెక్కిపోవడం, వేడెక్కిపోవడం మాత్రం ఇపుడు అతి పెద్ద చర్చకు దారి తీస్తోంది లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కావాలని డిమాండ్ చేస్తూ గతా పక్షం రోజులుగా సాగుతున్న ఆందోళన కాస్తా బుధవారం హింసాత్మకంగా మారింది. ఘర్షణలు సైతం చెలరేగడంతో నలుగురు యువకులు మరణించారు. బీజేపీ ఆఫీసుకు నిప్పంటించిన ఆందోళకారులు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అంటున్నారు.

రాష్ట్ర హోదా ఇవ్వాల్సిందే :

లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా అలాగే ఇవ్వాల్సిందే అన్నది ప్రధాన డిమాండ్ గా చేసుకుని ఈ నెల 10 నుంచి అక్కడ ఆందోళనలు సాగుతున్నాయి. పదిహేను మంది దాకా ఆందోళనకారులు అమరణ దీక్ష కూడా చేస్తున్నారు. అదే విధంగా ఆరో షెడ్యూల్ పొడిగింపుని కూడా ఆందోళనకారులు కోరుతున్నారు. ఇక అమరణ దీక్షలో ఉన్న వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలోనే లద్దాఖ్ అపెక్స్ బాడీ యువజన విభాగం భారీ ఎత్తున ఆందోళనలకు పిలుపు ఇచ్చింది.

మండుతున లేహ్ నగరం :

ఎపుడూ కూల్ గా ప్రశాంతంగా ఉండే లేహ్ నగరం ఇపుడు ఆందోళనలతో అట్టుడుకుతోంది. పెద్ద ఎత్తున ఆందోళనకారులు వీధుల్లోకి రావడమే కాదు భద్రతాదళాలను లక్ష్యంగా చేసుకుని రాళ్ళు రువ్వడంతో పాటు ఏకంగా పోలీసుల వాహనాలకే నిప్పు పెట్టారు. అంతే కాదు బీజేపీ ఆఫీసుని తగులబెట్టారు. దాంతో వారిని అదుపు చేసేందుకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా నిషేధాజ్ఞలు విధించారు. ఇక ఆందోళనకారులు పోలీసుల మధ్యలో ఘర్షణ చెలరేగడంతో ఫైరింగ్ చోటు చేసుకుంది. దీంతో నలుగురు యువకులు చనిపోగా మరో ముప్పయి మంది దాకా ఆందోళనకారులు గాయాలపాలు అయ్యారు.

లద్దాఖ్లో మొదటిసారిగా :

ఇంతటి ఉదిక్తత చోటు చేసుకోవడం అన్నది లద్దాఖ్లో ఇదే మొదటిసారిగా చెబుతున్నారు. రాష్ట్ర హోదా అంటూ యువత అమరణ దీక్షలకు దిగడంతోనే వాతావరణం మారిపోయింది. రాష్ట్ర హోదా వస్తే తమ బతుకులు బాగుపడతాయని యువత ఈ ఉద్యమాన్ని చేస్తోంది. అయితే ఈ ఉద్యమానికి ప్రముఖ వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన శాంతియుతంగానే అంతా జరగాలని కోరుకుంటున్నా యువతలో ఆవేశం పరిస్థితిని ఇలా దిగజార్చింది అని అంటున్నారు. మరో వైపు కేంద్ర ప్రభుత్వం సైతం అప్రమత్తం అయింది. లద్దాఖ్లో డిమాండ్ల మీద చర్చించేందుకు ప్రతినిధులను అక్టోబర్ 5న ఢిల్లీకి ఆహ్వానించింది. ఇంతలోనే మరో రూపునకు ఉద్యమం దారి తీసింది అని అంటున్నారు.

ఆరేళ్ళ తరువాత :

ఇక 2019 ఆగస్ట్ వరకూ జమ్మూ అండ్ కాశ్మీర్ రాష్ట్రంగా ఉండేది ప్రత్యేక ప్రతిపత్తి కూడా కల్పించారు. అదే ఏడాది ఆగస్ట్ 5న ఆర్టికల్ 370 ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అంతే కాదు కాశ్మీర్ లద్దాఖ్ లని కేంద్ర పాలిత ప్రాంతాలుగా చేసింది. ఆ తరువాత నుంచి లద్దాఖ్ ని ప్రత్యేక రాష్ట్ర హోదాతో వేరేగా ప్రకటించాలని డిమాండ్లు ఉన్నాయి. రాష్ట్ర హోదా ఇచ్చి భారత రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ చేర్చాలనే డిమాండ్ ఉంది. అదిపుడు మరింతగా ఊపందుకుంది. దాంతోనే ఈ విధంగా మంచు కొండల మధ్య మంటలు పుట్టాయని అంటున్నారు. కేంద్రం ఈ మంటలను ఆర్పేందుకు ఏ రకమైన ప్రయత్నాలు చేస్తుందో చూడాల్సి ఉంది.

### ఎసిబికి చిక్కిన మోమిన్ పేట వ్యవసాయాధికారి

వికారాబాద్,మోమిన్ పేట్ మండల వ్యవసాయ శాఖ అధికారి భూపతి జయశంకర్, ఫర్టిలైజర్ షాప్ అనుమతుల కోసం లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఒక ఫర్టిలైజర్ షాప్ లైసెన్స్ కోసం జయశంకర్ లంచం డిమాండ్ చేశారు. మొదటగా రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేయగా, చివరికి రూ. 75 వేలకు అంగీకరించారు. లైసెన్స్ అనుమతులు ఇచ్చిన తర్వాత, మొదటి విడతగా రూ. 50 వేలు లంచం తీసుకుంటు-న్న సమయంలో ఏసీబీ అధికారులు అతన్ని పట్టుకున్నారు. వికారాబాద్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఈ వివరాలను వెల్లడించారు. అవినీతికి వ్యతిరేకంగా ఏసీబీ అధికారులు చేపట్టిన ఈ ఆపరేషన్‌లో

# ఆది శ్రీనివాస్ ప్రోటోకాల్ ఇష్యూలో ట్విస్ట్.. కలెక్టర్‌పై నో యాక్షన్.. డీపీఆర్వోపై వేటు..



సిరిసిల్ల:ఇష్యూ అటు ఇటు తిరిగింది. చివరకు ఓ అధికారి మెడకు చుట్టుకుంది. అసలు సమస్య కలెక్టర్‌తో అయితే..ఓ కార్టూన్ పోస్ట్‌తో డీపీఆర్వోపై వేటు పడింది. అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే.. పైగా ప్రభుత్వ విప్..ఆయనకే ప్రోటోకాల్ పాటించడం లేదంటూ గత వారం రోజులుగా పెద్ద రచ్చే జరుగుతోంది. దీనికి బాధ్యుడైన కలెక్టర్‌పై చర్యలుంటాయని అందరూ భావిస్తుంటేఇప్పుడా వివాదం డీపీఆర్వో సస్పెండ్‌తో ముగిసిపోయినట్టే కన్పిస్తోంది.ట్విస్ట్ ఏంటంటే తనను సస్పెండ్ చేశారంటూ ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ కాపీని సదరు డీపీఆర్వోనే వాట్సప్ గ్రూప్‌లో షేర్ చేయడం ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఆది శ్రీనివాస్ ప్రోటోకాల్ ఇష్యూ ట్రాక్ తప్పిందా? ఎమ్మెల్యేను కించపరిచినట్లు ఉన్న కార్టూన్‌ను డీపీఆర్వో ఎందుకు పోస్ట్ చేసినట్లు? తనపై బదిలీ వేటు ఖాయమని జరిగిన చర్చకు డీపీఆర్వో సస్పెన్షన్‌తో కలెక్టర్ తనదైన శైలిలో ముగింపు ఇచ్చారా?రాజన్న సిరిసిల్ల నేతల తీరు..అధికారుల వ్యవహార శైలి సమ్‌థింగ్ డిఫరెంట్‌గా మారింది. నిన్న మొన్నటి వరకు జిల్లా రాజకీయాలను ఒంటి చేత్తో శాసించారు అప్పటి మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేటీఆర్‌కు చెక్ పెట్టేందుకు అప్పట్లో మంచి పోస్టింగ్‌లు ఇవ్వక పక్కన పెట్టిన ఓ ఐఏఎస్‌ను ఏరికోరి సిరిసిల్లలో పోస్టింగ్ ఇచ్చారు అధికార పార్టీ నేతలు. అయితే మొదట్లో కేటీఆర్ టార్గెట్‌గానే కలెక్టర్ ముందుకు పోతున్నట్టే కన్పించినా..ఇప్పుడది వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు తగులుతోందన్న చర్చ నడుస్తోంది.

కలెక్టర్ ప్రోటోకాల్ పాటించడం లేదంటూ రచ్చ..

ఆదికి కలెక్టర్ ప్రోటోకాల్ పాటించడం లేదంటూ కొన్నాళ్లుగా రచ్చ నడుస్తుంది. ప్రజాపాలన వేడుకల్లో తనకు ప్రోటోకాల్ కల్పించలేదని వేదిక మీద నుండే కలెక్టర్‌పై ఉన్నతాధికారులకు ఆది శ్రీనివాస్ ఫిర్యాదు చేయడం హాట్ టాపిక్ అయింది. తర్వాత సీఎస్‌కు కూడా కంప్లైంట్ చేశారు. అంతేకాదు బీసీ నేతను అవమానిస్తున్నారంటూ బీసీ సంఘాల నేతలు నిరసన తెలిపారు. దీంతో కలెక్టర్‌కు షోకాజు నోటీసు కూడా జారీ చేసింది సర్కార్.ఇక కలెక్టర్‌పై బదిలీ వేటే మిగిలింది అన్న చర్చ జరుగుతున్న సమయంలోనే సిరిసిల్ల డీపీఆర్వో రంగంలోకి దిగారు. జిల్లా అధికారుల వాట్సప్ గ్రూప్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కించపరుస్తూ కలెక్టర్‌కు మద్దతుగా ఎవరో గీసిన ఓ కార్టూన్‌ను డీపీఆర్వో పోస్టు చేశారు. ఈ వ్యవహారంపై ఆది శ్రీనివాస్ అనుచరులు, కాంగ్రెస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఆయన రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో డీపీఆర్వో శ్రీధర్‌పై గంటల్లోనే వేటు వేశారు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.తన మీద ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ ఇచ్చిన ఉత్తర్వుల కాపీని..సంబంధిత డీపీఆర్వోనే జిల్లా రిపోర్టర్స్ గ్రూప్ లో షేర్ చేయడం హాట్ టాపిక్ గా మారింది. సస్పెన్షన్ మీద హ్యాపీగా ఫీల్ అవుతున్నట్లు సస్పెండ్ అయిన డీపీఆర్వోనే వాట్సప్‌లో షేర్ చేయడమేంటన్న చర్చ జరుగుతోంది.

కలెక్టర్ మీద యాక్షన్‌కు బదులు డీపీఆర్వో మీద వేటు..

ప్రభుత్వ విప్ అయిన ఆది శ్రీనివాస్ తనకు ప్రోటోకాల్ పాటించడం లేదంటూ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆయనపై చర్యలు తీసుకుంటారని అంతా భావిస్తున్న తరుణంలో కలెక్టర్ మీద యాక్షన్‌కు బదులు డీపీఆర్వో మీద వేటు పడింది. అది కూడా కలెక్టరే ఉత్తర్వులు జారీ చేయడం ఇంట్రెస్టింగ్ విషయం.సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సిరిసిల్లలో జరిగిన కార్యక్రమంలో ఆది శ్రీనివాస్‌కు ప్రోటోకాల్ పాటించలేదు జిల్లా అధికారులు. జెండా వందనం ముగింపు దశలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చివరి నిమిషంలో వచ్చి సెల్యూట్ చేశారు. పైగా జనగణమన గీతం పాడుతున్నప్పుడు..కలెక్టర్ దర్జాగా కారు దిగి స్టేజ్ ఎక్కి సెల్యూట్ చేయడం వివాదాస్పదమైంది.ముందుగా వచ్చి అతిథులను గౌరవించుకోవాల్సింది పోయి.. ఆయనే అతిథిగా రావడం ఏంటంటూ గుసగుసలాడారు. విప్ ఆది శ్రీనివాస్‌కు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో..కలెక్టర్ తీరుపై సీఎస్‌కు, ప్రోటోకాల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో ఆది శ్రీనివాస్‌కు మాట్లాడే అవకాశం కల్పించారు. అయితే అధికార పార్టీ నేతలనే కలెక్టర్ ఖాతరు చేయడం లేదంటూ పెద్ద దుమారమే లేచింది.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోనూ విప్ ఆది శ్రీనివాస్‌ను అవమానించారట కలెక్టర్. అతిథిగా వచ్చిన..ఆది శ్రీనివాస్‌ను కలెక్టర్, ఎస్పీ గౌరవంగా ఆహ్వానించడానికి రాలేదట. దీంతో ఆది శ్రీనివాస్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారట. ఇక తమ బీసీ నాయకుడిని కలెక్టర్ అవమానిస్తున్నారంటూ సిరిసిల్ల జిల్లా బీసీ సంఘాల నేతలు..సీపీకి కంప్లైట్ చేశారు. అయితే ఇప్పుడు కార్టూన్ వివాదంతో డీపీఆర్వో శ్రీధర్ బలి కావాల్సి వచ్చిందన్న టాక్ వినిపిస్తోంది.ప్రోటోకాల్ వివాదంతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝానే జిల్లా నుంచి ట్రాన్స్‌ఫర్ చేస్తారన్న టాక్ వినిపించింది. అందుకు సెక్రటేరియట్‌లో ఫైల్ రెడీ అవుతుందని ప్రచారం నడుస్తున్న టైమ్‌లోనే డీపీఆర్వో ఓ కార్టూన్‌ను వాట్సప్ గ్రూప్‌లో పెట్టడం వివాదాస్పదం అయింది. కట్ చేస్తే ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ ఉత్తర్వుల కాపీని కూడా తనకు అవార్డు వచ్చినట్లు ఆయన వాట్సప్‌లో షేర్ చేయడం చర్చనీయాంశంగా మారింది.

కాంట్రవర్సీకి కేరాఫ్ డీపీఆర్ వో శ్రీధర్..

అయితే డీపీఆర్వో శ్రీధర్ ఎక్కడ పనిచేసినా కాంట్రవర్సీకి కేరాఫ్‌గా ఉంటారట. గతంలో పెద్దపల్లి జిల్లా డీపీఆర్వోగా పని చేసినప్పుడు సాంస్కృతిక సారధి ఉద్యోగినితో ఫోన్ కన్వర్జేషన్‌లో చిక్కుల్లో పడ్డారట. ఆ తర్వాత జగిత్యాల డీపీఆర్వోగా పని చేసిప్పుడు మీడియా ప్రతినిధులతో గొడవ పెట్టుకున్నారట. ఇక సిరిసిల్లకు వచ్చేసరికి కలెక్టర్‌కు మద్దతుగా ఎమ్మెల్యేను కించపరుస్తూ ఉన్న కార్టూన్‌ను వాట్సప్ గ్రూప్‌లో షేర్ చేసి సస్పెండ్ అయ్యారు. అయితే సిరిసిల్ల ఎపిసోడ్ వెరీ ఇంట్రెస్టింగ్‌గా మారింది. కలెక్టర్ మీద వేటు పడాల్సింది పోయి ఇష్యూ డీపీఆర్వో మీదకు మళ్లిందన్న టాక్ వినిపిస్తోంది. అదికూడా ఇష్యూని డైవర్ట్ చేసేందుకు అధికారులే డ్రామా ఆడుతున్నారా అన్న చర్చ కూడా కాంగ్రెస్ శ్రేణుల్లో నడుస్తోంది.

# స్థానిక సంస్థల ఎన్నికలంటే కాంగ్రెస్‌కు జంకు : రఘునందన్‌రావు

హైదరాబాద్,స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలంటే కాంగ్రెస్ పార్టీ జంకుతుందని ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. 20నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏం చేయాలో అర్థం కానీ కన్ఫ్యూజన్‌లో ఉందని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసమర్థతను, అవినీతిని, కుటుంబ పాలనను ఎండగడుతామని కాంగ్రెస్ చెప్పి అధికారంలోకి వచ్చిందని.. కానీ ఏం చేస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. లక్ష కోట్లు కేసీఆర్ కుటుంబం నుంచి కక్కించి పేద ప్రజలకు అందిస్తామని కాంగ్రెస్ చెప్పలేదా అని ప్రశ్నించారు. నేడు డబ్బులు లేవని సంక్షేమ పథకాలు ఇవ్వలేని దుస్థితికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేరిందని ఆరోపించారు. పదేళ్లు బీఆర్ఎస్ పాలనలో దోసుకున్న సొమ్ముతో కొందరు ఆగడం లేదని మండిపడ్డారు ఎంపీ రఘునందన్ రావు. బీఆర్ఎస్ నేతలు మీడియాను మేనేజ్ చేసి నోటికి వచ్చింది మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గురువారం సిద్దిపేట జిల్లా బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో రఘునందన్ రావు మాట్లాడారు. వర్షాలు బాగా కురిశాయని.. ఒక దశలో వానలు ఆగాలని అన్నదాతలు కోరుతున్నారని చెప్పుకొచ్చారు. ప్రకృతి, పర్యావరణం ప్రకోపిస్తోందని తెలిపారు. మనుషుల ప్రవర్తన మారి మంచి బుద్ధి ప్రసాదించాలని నవరాత్రుల సందర్భంగా కనక దుర్గమ్మను కోరుకున్నానని పేర్కొన్నారు. దేశంలో జాతీయ రహదారులు తప్పా మిగతా రహదారులపై కనీసం కారు వెళ్లే పరిస్థితి లేదని తెలిపారు ఎంపీ రఘునందన్ రావు. నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల రోడ్లు గుంతల మయంగా మారాయని వెల్లడించారు. దసరా సెలవులను ఉపాధ్యాయులు రద్దు చేసుకొని ఉద్యోగం చేయాలనే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు ఒత్తిడి



చేస్తోందని ప్రశ్నించారు. దసరా సెలవుల కోసం ఊరు వెళ్లిన ఉపాధ్యాయులను ఉద్యోగం చేయాలని ఎందుకు అధికారులు కోరుతున్నారని నిలదీశారు. 42శాతం బీసీ రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని.. ఇప్పటికీ కూడా అందుకు సంబంధించిన జీవో ఎందుకు పాస్ చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ జీవోపై ఎవరూ కోర్టుకి వెళ్తారో తెల్వని పరిస్థితిలో ఉద్యోగులను దసరా సెలవుల్లో కూడా పని చేయించడం సరికాదని చెప్పుకొచ్చారు. దసరా సెలవుల్లో కూడా ఉద్యోగులతో ప్రభుత్వం పని చేయిస్తోందని.. ఈ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. తెలంగాణలో ఆడబిడ్డలకు ఎంతో ఇష్టమైన పెద్ద పండగ బతుకమ్మ, టీచర్లలో ఎక్కువ మంది మహిళలు ఉంటారని చెప్పుకొచ్చారు. దసరా సెలవుల్లో కూడా ఉపాధ్యాయులు పనిచేసే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన ఆలోచనను మరోసారి పునరాలోచన చేయాలని రఘునందన్ రావు సూచించారు.

# అసెంబ్లీలో వివాదం,చిరంజీవి లేఖ సంచలనం!




అమరావతి,ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో సినీ పరిశ్రమ వివాదం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. చర్చ మధ్యలో చిరంజీవి పేరు ప్రస్తావనకు రాగా బాలకృష్ణ సీరియస్ అయ్యారు. బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చిరంజీవి జగన్‌ను గట్టిగా నిలదీశారని చెప్పగా, బాలకృష్ణ “అబద్ధం” అని ఖండించారు. దీనికి చిరంజీవి లేఖ ద్వారా కౌంటర్ ఇచ్చారు. ఇది సినీ మరియు పొలిటికల్ సర్కిల్స్‌లో భారీ చర్చకు దారితీసింది. ఫ్యాన్స్ సోషల్? మీడియాలో చర్చలు మొదలు పెట్టారు. అసలు ఈ వివాదం వెనుక ఏం జరిగింది.?

చిరంజీవిపై నోరుపారేసుకున్న బాలకృష్ణ

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ, కూటమి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్? మధ్య కొంత వాగ్వాదం జరిగింది. అయితే దాంట్లో చిరంజీవి పేరు రావడంతో బాలకృష్ణ సీరియస్? కావడం, చిరంజీవిపై వ్యంగంగా వ్యాఖ్యానించడం ఇప్పుడు కొత్త జగడం మొదలైంది. జగన్ హయాంలో సినీ ప్రముఖులకు జరిగిన అవమానంపై చర్చ జరుగుతుండగా, ఎమ్మెల్యే కామినేని చేసిన వ్యాఖ్యలకు బాలకృష్ణ తనదైన శైలిలో ప్రతిస్పందించారు.కామినేని మాట్లాడుతూ ం “ఆ సమయంలో జగన్ సినీ ప్రముఖులను కలిసేందుకు నిరాకరించగా, చిరంజీవి గట్టిగా అడిగాక సీఎం వారిని కలిశారు” అని పేర్కొన్నారు. అయితే ఈ వ్యాఖ్యలతో బాలకృష్ణ ఏకీభవించలేదు.బాలకృష్ణ స్పష్టంగా చెబుతూ “ఆ రోజు గట్టిగా అడిగిన వాడెవ్వడూ లేదు. నాన్సెన్స్?.. నిజానికి ఆ సైకో కలిసేందుకు నన్ను కూడా ఆహ్వానించారు, కానీ నేను వెళ్లలేదు. చిరంజీవిని అవమానించారన్నది మాత్రం నిజమే” అన్నారు. ఈ వ్యాఖ్యలతో అసెంబ్లీలో చర్చ కాసేపు వేడెక్కింది. కామినేని వ్యాఖ్యలు చిరంజీవి హీరోయిజాన్ని పెంచేలా ఉన్నాయని, కానీ వాస్తవానికి అలా జరగలేదని బాలకృష్ణ స్పష్టం చేశారు. అదే సమయంలో, సినీ పరిశ్రమను అవమానించే విధంగా అప్పటి ప్రభుత్వం ప్రవర్తించిందని కూడా బాలకృష్ణ ఎత్తి చూపారు. అలాగే కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ం “ఫిలిం డెవలప్?మెంట్? కార్పొరేషన్ తయారు చేసిన లిస్ట్‌లో నా పేరు తొమ్మిదో స్థానంలో ముద్రించారు. ఆ రోజే సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ గారిని ఎవడాడు దీన్ని రాసిందని నిలదీసాను” అని గుర్తు చేశారు. ఆయన ఇంకా మాట్లాడుతూ “సభకు స్పష్టత ఇవ్వాలనే ఉద్దేశంతోనే నేను మాట్లాడాను. ఏదైనా తప్పుగా అనిపిస్తే క్షమించండి” అని అన్నారు.ఈ నేపథ్యంలోనే బాలయ్య వ్యాఖ్యలకు స్పందిస్తూ మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక పత్రికా ప్రకటన విడుదల చేశారు. విదేశాల్లో ఉన్న చిరంజీవి ఈ మేరకు అసలు జరిగిందేమిటో వివరించారు.చిరంజీవి పత్రికా ప్రకటన గౌరవం ఇచ్చిపుచ్చుకునేలా మాట్లాడతా

అప్పట్లో ఏపీ సీఎంను కలిసిన చిత్ర పరిశ్రమ ప్రముఖులు

అసెంబ్లీలో తన పేరు ప్రస్తావనకు రావడంతో మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేకంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం,

– అప్పట్లో నిర్మాతలు, దర్శకులు, ఫిలిం చాంబర్ ప్రతినిధులు కలిసి సినిమా టికెట్ల ధరల సమస్యపై మాట్లాడాలని కోరగా, ఆయన ముందుకు వచ్చారని చెప్పారు.

– ఆహ్వానం మేరకే జగన్‌ను కలిసానని, సమావేశంలో ఆయనకు పరిశ్రమ ఇబ్బందులు వివరించానని వెల్లడించారు.

– కోవిడ్ కారణంగా ఐదుగురే రావాలని ప్రభుత్వం చెప్పినా, తాను మరికొందరిని తీసుకువెళ్లానని వివరించారు.

– బాలకృష్ణను కూడా సంప్రదించడానికి ప్రయత్నించానని, కానీ ఆయన అందుబాటులోకి రాలేదని, జెమిని కిరణ్ ద్వారా కూడా ప్రయత్నించామని చెప్పారు.

“నేను ఎవరితోనైనా, ముఖ్యమంత్రితోనైనా గౌరవం ఇచ్చిపుచ్చుకునే విధంగానే మాట్లాడతాను. ముఖ్యమంత్రికి నచ్చచెప్పడంవల్ల టికెట్? రేట్లు పెంచడానికి అనుమతించారు. దానివల్ల పరిశ్రమకు కొంత మేలు జరిగింది.” అని చిరంజీవి తన లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు.

ఈ ప్రకటనతో అసెంబ్లీలోని వివాదానికి ఆయన క్లారిటీ ఇచ్చారు. బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు గౌరవప్రదంగానే స్పందిస్తూ, తన వర్గం, పరిశ్రమ కోసం తీసుకున్న చర్యలను గుర్తు చేశారు.

ఏపీ అసెంబ్లీలో జరిగిన చర్చలో బాలకృష్ణ, కామినేని వ్యాఖ్యలు మరోసారి సినీరాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. చిరంజీవి ఇచ్చిన పత్రికా ప్రకటన ఈ వివాదానికి ముగింపు పలుకుతుందా లేక కొత్త వివాదానికి తెర లేపుతుందా అనేది ఇప్పుడు ఆసక్తికర విషయం.

# కోనప్పకు మళ్లీ బీఆర్ఎస్ కండువా!

హైదరాబాద్,సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ లో చేరినా ప్రయోజనం లేకుండా పోయిందని .. రాజకీయంగా కూడా తనను పట్టించుకోవడంలేదని లేదని అసంతృప్తిలో ఉన్న ఆయనను బీఆర్ఎస్ హైకమాండ్ పిలిచి కండువా తప్పింది. ఆయన సోదరుడు, మాజీ జెడ్పీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు కూడా బీఆర్ఎస్‌లో చేరారు.

కోనప్ప గత ఎన్నికల్లో సిర్పూర్ నుంచి బీఆర్ఎస్ తరపునే పోటీ చేసి ఓడిపోయారు.అక్కడ బీజేపీ గెలిచింది. బీఎస్పీ తరపున ఆర్ఎస్ ప్రవీణ్ పోటీ చేసి భారీగా ఓట్లు చీల్చడంతో ఆయన ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ప్రవీణ్ ను పార్టీలో చేర్చుకోవడంతో ఆయన బీఆర్ఎస్ పెద్దలపై ఆగ్రహంతో పార్టీని వీడారు. కోనప్ప మొదటి సారి 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్ లో టిక్కెట్ రాకపోవడంతో ఆయన , ఇంద్రకరణ్ రెడ్డి ఇద్దరూ కలిసి బీఎస్పీ తరపున పోటీ చేసి గెలిచారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018లోనూ గెలిచారు. గత ఎన్నికల్లో ఆర్ఎస్ ప్రవీణ్ వల్ల ఓడిపోయారు.ఆయనకు దక్కుతున్న ప్రాధాన్యంతో తనకు ఇక సిర్పూర్ లో చాన్స్ రాదనుకున్న కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. అక్కడ ఆయనకు ఎలాంటి



ప్రాధాన్యత దక్కలేదు. పైగా కాంగ్రెస్ నేతలు చికాకు పెట్టడం ప్రారంభించారు. దాంతో పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినా కాంగ్రెస్ పట్టించుకోకపోవడంతో మళ్లీ గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సారి ప్రవీణ్ కు ఎంపీ లేదా.. ఇతర నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఇస్తామని సిర్పూర్ ఆయనదేనని కేటీఆర్ హామీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

# కాంగ్రెస్ మీదనే తొలి పోరాటం షురూ అయ్యింది..



న్యూఢిల్లీ,ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీ అధినాయకుడు రాహుల్ గాంధీ ఎక్కడికి వెళ్ళినా సరే.. మనదేశంలో జెన్ జెడ్ ఉద్యమం రావాలని కోరుకుంటున్నారు. నేపాల్ తరహాలోనే యువత ఉద్యమించాలని పిలుపునిస్తున్నారు. అలాంటి ఉద్యమం వల్ల చెలరేగిపోయే మంటల్లో చలికాచుకోవాలని భావిస్తున్నారు. వాస్తవానికి ఏ నాయకుడైనా సరే అధికారంలోకి రావాలని అనుకుంటాడు. ప్రజలను పరిపాలించాలని భావిస్తుంటాడు. కానీ రాహుల్ గాంధీ తన పార్టీని బలోపేతం చేసుకోకుండా.. తన పార్టీలో జరుగుతున్న తప్పులను సమీక్షించుకోకుండా.. తనకోసం ప్రజల ఉద్యమాలు చేస్తే అధికారంలోకి వస్తానని కలలు కంటున్నాడు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నాయకుడి లక్షణం ఇది కాదు. ఎందుకంటే ప్రజా సమస్యలపై పోరాడాలి. ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యే దిశగా అడుగులు వేయాలి. ప్రజలలో నమ్మకాన్ని పెంచుకోవాలి. ప్రజలు ఓట్లు వేస్తే గెలవాలి.. అప్పుడే అధికారం సాధ్యమవుతుంది. కానీ ఈ విషయాన్ని రాహుల్ గాంధీ మర్చిపోతున్నారు.రాహుల్ గాంధీ పదేపదే చెబుతున్న జెన్ జడ్ ఉద్యమం.. ఆయన పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో మొదలైంది. కర్ణాటక రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని అక్కడికి యువత రోడ్లమీదకి ఎక్కింది. ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా వేలాదిమంది రోడ్లమీదకి వచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జెన్ జెడ్ ఆశలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం యువత ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవడం లేదని ఆరోపించారు.ఇక ఇటీవల కాలంలో కర్ణాటక రాష్ట్రంలో పరిస్థితులు బాగోలేవని.. ముఖ్యంగా ఐటీ రాజధాని అని చెప్పుకునే బెంగళూరులో రోడ్లు ఏమాత్రం బాగోలేవని బ్లాక్ బాక్స్ అనే కంపెనీ ఆరోపించింది. బెంగళూరు నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నట్టు వెల్లడించింది.. ఆ కంపెనీ ఆ నిర్ణయాన్ని ప్రకటించడమే ఆలస్యం.. మిగతా రాష్ట్రాలు కీలక ప్రకటన చేశాయి. తన ప్రాంతంలోకి రావాలని ఆహ్వానం కూడా పలికాయి.. ఓటు చోరీ అంటూ.. ఓట్ల గల్లంతు అంటూ.. జన్ జడ్ ఉద్యమం అంటూ రకరకాల పల్లవులను ఇటీవల కాలంలో రాహుల్ గాంధీ అందుకుంటున్నారు. కాని చివరికి తన పార్టీ అధికారంలోనే రాష్ట్రంలోనే జన్ జడ్ ఉద్యమం మొదలవుతుందని కలలో కూడా ఊహించలేదు.. అందుకే మన ఇంటి పరిస్థితిని చూసుకున్న తర్వాతే.. పొరుగింటి గురించి ఆలోచించాలని పెద్దలంటుంటారు. ఇప్పటికైనా ఈ విషయాన్ని రాహుల్ గాంధీ గుర్తిస్తే మంచిదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## ఉద్యోగులకు తీపి కబురు చెప్పిన ప్రభుత్వం

హైదరాబాద్,దసరా నవరాత్రుల వేళ రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పలువురు ఉద్యోగులకు దసరా కానుక ప్రకటించింది. అందులో భాగంగా రాష్ట్రంలో భూ భారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించింది. దీంతో 708 మంది ఎఫ్‌టీఎస్‌లను టీజీటీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే ఆ యా ఉద్యోగుల జీతాలు పెంచుతూ గురువారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# రాహుల్ తో కలసి షర్మిల మాస్టర్ ప్లాన్

అమరావతి,ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తన రాజకీయానికి పదును పెడుతున్నారు. గతానికి భిన్నంగా ఇపుడు ఆమె ఏపీలో టీడీపీ కూటమి మీద తీవ్ర విమర్శలే చేస్తున్నారు. వైసీపీని ఒక వైపు టార్గెట్ చేస్తూనే కూటమిని కార్నర్ చేయడం ద్వారా ఏపీలో కాంగ్రెస్ బలోపేతానికి గట్టిగానే చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ స్థాయిలో మెల్లగా మారుతున్న రాజకీయాన్ని కూడా ఆమె గమనంలోకి తీసుకుంటున్నారు అని అంటున్నారు. ఏపీలో చూస్తే ప్రస్తుతానికి ఏకైక బలమైన ప్రతిపక్షంగా వైసీపీ ఉంది. ఇక తరువాత స్థానంలో దూసుకుని రావాలని షర్మిల వ్యూహ రచన చేస్తున్నారు.

బీహార్ కోసం వెయిటింగ్ :

నవంబర్ నెలలో బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు ఉన్నాయి. ఈసారి హోరా హోరీ పోరు సాగే అవకాశాలు ఉన్నాయని సర్వేలు చెబుతున్నాయి. అయితే ఎడ్జ్ మాత్రం ఇండియా కూటమికి ఉండొచ్చు అని అంటున్నారు. మరో వైపు చూస్తే రాహుల్ గాంధీ ఓటర్ అధికార యాత్ర కూడా బీహార్ ఓటర్లను మెప్పించింది అని అంటున్నారు. తాజాగా జరిగిన సీడబ్ల్యూసీ మీటింగ్ గురి కూడా బీహార్ మీదనే పెట్టారు. ఇక ప్రియాంక తొందరలో హర్ ఘర్ అధికార్ పేరుతో యాత్ర చేపడుతున్నారు. మొత్తం మీద బీహార్ ఎన్నికలతో కాంగ్రెస్ గణనీయంగా పుంజుకుంటుంది అన్న ఆశాభావం అంతా వ్యక్తం చేస్తున్నారు. దాంతో నవంబర్ మూడో వారంలో ఎన్నికలు జరిగి ఫలితాలు వస్తాయని అంటున్నారు. దాని కోసం షర్మిల వెయిట్ చేస్తున్నారు అని అంటున్నారు.

కాంగ్రెస్ కూటమి గెలిస్తే :

ఉత్తరాదిన హిందీ బెల్ట్ లో ఒక కీలకమైన పెద్ద రాష్ట్రం బీహార్ లో కనుక కాంగ్రెస్ కూటమి గెలిస్తే ఇక జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ కి అనుకూల వాతావరణానికి దారులు తెరచుకున్నట్లే అని భావిస్తున్నారు. రాహుల్ గాంధీ ఓట్ చోరీ పేరుతో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం మీద తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇవి జనంలోకి బలంగా వెళ్తున్నాయి. ఇంకో వైపు చూస్తే కనుక కాంగ్రెస్ గ్రాఫ్ కూడా నెమ్మదిగా దేశంలో పెరుగుతున్న వాతావరణం కనిపిస్తోంది బీహార్ కనుక ఎన్డీయేను ఓడించి కాంగ్రెస్ కూటమి హస్తగతం చేసుకుంటే చాలా వేగంగా జాతీయ స్థాయిలో మార్పులు వస్తాయని అంతా భావిస్తున్నారు.



ఇక దాని ప్రభావం ఏపీ మీద కూడా పెద్ద ఎత్తున పడుతుంది అని షర్మిల చూస్తున్నారు అని అంటున్నారు.

రాహుల్ తో భారీ సభ :

బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే ఆ తరువాత రాహుల్ గాంధీని ఏపీకి రప్పించి భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయించాలని షర్మిల చూస్తున్నారు అని అంటున్నారు. దాంతో ఏపీ కాంగ్రెస్ లో కూడా స్తబ్దత తొలగిపోయి కొత్త ఉత్సాహం వస్తుందని అంటున్నారు. అంతే కాకుండా ఎన్ డీయే వ్యతిరేక ఓటు బ్యాంక్ ని న్యూట్రల్ సెక్షన్స్ కి మైనారిటీలు ఎస్సీ ఎస్టీ వర్గాలను తిరిగి కాంగ్రెస్ వైపు నడిపించేందుకు కూడా మార్గం సుగమం అవుతుందని షర్మిల భావిస్తున్నారు అని అంటున్నారు.ఏపీలో అన్ని పార్టీకి ప్రత్యక్షంగా పరోక్షంగా ఎన్డీయే కూటమికి మద్దతుగా నిలుస్తున్న క్రమంలో ఎన్డీయే వ్యతిరేక భావజాలాన్ని ఓడిసిపట్టుకోవాలని షర్మిల చూస్తున్నారు అని అంటున్నారు. రాహుల్ సభ తరువాత ఏపీలో కాంగ్రెస్ కార్యకలాపాలను ఉధృతం చేయాలని చూస్తున్నారు. బీహార్ లో కనుక కాంగ్రెస్ విజయం సాధిస్తే ఏపీలో కూడా కాంగ్రెస్ వైపు వచ్చే నాయకుల సంఖ్య బాగా పెరుగుతుందని అది పార్టీకి బూస్ట్ ఇస్తుందని కూడా ఆలోచిస్తున్నారుట. మొత్తానికి ఏపీలో కాంగ్రెస్ ని ఫోర్ ఫ్రంట్ లోకి తీసుకుని వచ్చేందుకు షర్మిల మాస్టర్ ప్లాన్ వేస్తున్నారు అని అంటున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com